J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 45 సంచిక : 37 13.2.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# ఫలితం శూన్యం.. పరిస్థితి దైన్యం!


## ఎంత చేసినా ఎందుకిలా..? కూటమిలో అంతర్మథనం!

- చెప్పినవన్నీ చేస్తున్నా.. కనపడని మైలేజి
- ప్రభుత్వ పెద్దల్లో నిట్టూర్పు.. నిర్వేదం
- అభివృద్ధిని మరుగున పడేస్తున్న విద్వేషాలు.. విధ్వంసాలు
- కీలక నిర్ణయాల్లో సైతం తర్జన భర్జనలు
- మేలుకోకుంటే.. ముప్పు తప్పదంటున్న విశ్లేషకులు

*"భారీగా పారిశ్రామిక పెట్టుబడులు, శరవేగంగా అమరావతి పనులు, సకాలంలో పోలవరానికి నిధులు, క్వాంటం వ్యాలీలు, గూగుల్ డేటా సెంటర్లు, రూపు మారిన రహదారులు, అన్నింటికంటే ముఖ్యంగా 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' అంటూ ప్రచారాలు. అయినా ప్రజల నుంచి ప్రశంసలు నిల్, విమర్శలు ఫుల్. పైగా గతంలోనే మేలంటూ సెటైర్లు, ఎందుకిలా? ఎంతకాలం ఇలా?"..* ఇదీ కూటమి పెద్దలను ప్రస్తుతం వేధిస్తున్న సమస్య. అయితే, రాజకీయ కక్షలు, కార్పణ్యాలు, ఈగోలు, విధ్వంసాలు, పాలనలో మూడుముక్కలాటలు, నిర్ణయాల్లో అలివిమాలిన ఆలస్యం వంటి విషయాలే ఈ పరిస్థితికి కారణంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా చేస్తున్న అభివృద్ధి మరుగున పడిపోతూ, అడ్డమైన విషయాలు, అసంబద్ధ వాదనలు తెరపైకి వస్తున్నాయనే వాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా తయారైంది. 164 సీట్లతో కావాల్సినంత బలం ఉన్నా, పెద్దఎత్తున బలగం ఉన్నా, ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు. ఎందుకంటే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు డెక్కాముక్కీలు తిని అభివృద్ధిలో మూడు అడుగులు ముందుకు తీసుకెళ్తే, రాజకీయ గొడవల కారణంగా అది ఆరు అడుగులు వెనక్కిపోతోంది. ఇంకా చెప్పాలంటే అప్పుల కుప్పగా మారి ఒడిదుడుకుల ప్రయాణం సాగిస్తున్న రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు, ఓ వైపు పెట్టుబడులను ఆసరాగా నిలబెడితే, మరోవైపు పేట్రేగిపోతున్న రాజకీయ ఆధిపత్య పోరు, ముఠా తగాదాలు, అర్థ రహిత వివాదాలు, వ్యక్తిగత దూషణలు, దాడులు, ప్రతి దాడులు, రాష్ట్రాన్ని అధఃపాతాళానికి తొక్కేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎంత చేసినా, ఎంత కష్టపడినా ప్రజల్లో ఇసుమంతైనా సదభిప్రాయం కలగడడం లేదు సరికదా... 'వాళ్ళే మేలు' అనే మాట ఎక్కువగా వినపడడడం కూటమి ప్రభుత్వ పెద్దలను కలవరపాటుకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విమర్శల జడివానను ఎలా తట్టుకోవాలి..? ప్రజల మన్ననలను ఎలా సంపాదించుకోవాలి? అనే విషయంపై వారంతా తీవ్రంగా

2లో






# నెల్లూరులో 'పార్కుల పండుగ'



ఓపెన్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి జాతర కొనసాగుతోంది. ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి పెద్దపీట వేస్తూ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'పార్కుల పండుగ' సరికొత్త శోభను చేకూరుస్తోంది. సుమారు 60లక్షల రూపాయల వ్యయంతో అన్ని రకాల హంగులతో, పచ్చదనంతో కళకళలాడుతున్న యలమవారిదిన్నె పార్కును ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఇటీవల మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అత్యాధునిక వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. పార్కులోని ఓపెన్ జిమ్‌లో మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా కసరత్తులు చేసి, ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలతో కలిసి ఆడుతూ, వారికి చాక్లెట్లు పంపిణీ చేస్తూ మంత్రి నారాయణ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, నెల్లూరును ఒక అత్యుత్తమ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెల్లూరు ఈ స్థాయిలో అభివృద్ధి చెందిందంటే అది కేవలం మంత్రి నారాయణ వల్లే సాధ్యమైందన్నారు. పేదల కష్టాలు స్వయంగా చూసిన వ్యక్తి కాబట్టి ప్రజల అవసరాలు ఆయనకు తెలుసని అన్నారు. కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# డాక్టర్ నాగేశ్వరరెడ్డి



బుచ్చిరెడ్డిపాలెం నివాసి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ వంగల నాగేశ్వరరెడ్డి ఫిబ్రవరి 9వ తేదీ తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 69 సంవత్సరాలు. నెల్లూరుజిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంతో పాటు పరిసర గ్రామాలలో సైతం బుచ్చిలోని దేవీనర్సింగ్ హోమ్ అంటే తెలియని వాళ్ళు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! బుచ్చితో పాటు చుట్టుపక్కల పల్లెల్లో పెద్దా చిన్నా అన్న తేడా లేకుండా ఎవరికి ఏ చిన్న అనారోగ్యం ఏర్పడినా చికిత్స కోసం దేవీనర్సింగ్ హోంకి వెళ్లడం గత 40 సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీ. ముఖ్యంగా పేదవాళ్ళు అనారోగ్య సమస్యతో తమ దేవీ నర్సింగ్ హోమ్‌కి వస్తే వారికి పూర్తిగా ఉచితంగా వైద్యం చేసి, అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇచ్చి పంపించే మానవతా హృదయం వున్న దంపతులుగా నాగేశ్వరరెడ్డి-దేవసేనమ్మ దంపతులకి గుర్తింపు ఉంది. అంతలా దేవి నర్సింగ్ హోమ్‌తో బుచ్చి ప్రాంత వాసుల బంధం పెనవేసుకుంది.

కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డ నాగేశ్వరరెడ్డి స్వస్థలం. వంగల పెద్ద తిరుపాల్‌రెడ్డి - శ్రీమతి లక్ష్మీదేవమ్మలు ఆయన అమ్మానాన్నలు. పుట్టింది ఓ సాధారణ రైతు కుటుంబంలో. కానీ, ఆయన బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగింది. ప్రాథమిక విద్య సెయింట్ పీటర్స్ పాఠశాలలోనూ, ఉన్నత విద్య వీ.ఆర్.కళాశాలలోనూ పూర్తి చేశారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య పట్టా పుచ్చుకున్నారు. 1984ఆగస్టు 1వ తేదీన కోటంరెడ్డి వారి ఆడపడుచు డాక్టర్ దేవసేనని పరిణయమాడి నెల్లూరుజిల్లా అల్లుడయ్యారు. డాక్టర్ డిగ్రీ అందుకున్న అనంతరం 1984 నుండి 1986 వరకూ రెండేళ్ళ పాటు ఆయన నెల్లూరు రామచంద్రారెడ్డి హాస్పిటల్‌లో వైద్యసేవలు అందించారు. ఆ తరుణంలోనే ఆయన శస్త్ర చికిత్సలు చేయడంలో కూడా ప్రావీణ్యం సంపాదించారు. బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాల నుండి ఎక్కువ సంఖ్యలో పేషంట్లు పీపుల్స్ పాలిక్లినిక్ (రామచంద్రారెడ్డి ఆసుపత్రి)కి రావడం గమనించిన నాగేశ్వరరెడ్డి ఆసుపత్రి నిర్వాహకుల సూచన మేరకు అందరికీ అందుబాటులో ఉండేలా బుచ్చిలో 1986 జనవరిలో దేవీ నర్సింగ్‌హోమ్‌ని ప్రారంభించారు. ఆయన తుదిశ్వాస విడిచే వరకూ వైద్యసేవలు అందిస్తూనే ఫిబ్రవరి 9న ఆకస్మికంగా అమరలోకాలకి వెళ్లిపోయారు. నాగేశ్వరరెడ్డికి భార్య డాక్టర్ దేవసేన, కుమార్తె డాక్టర్ విష్ణుప్రియ ఉన్నారు. ఇంతటి పెద్దదిక్కుని కోల్పోయి విషాదంలో ఉన్న నాగేశ్వరరెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఫలితం శూన్యం.. పరిస్థితి దైన్యం!

(మొదటిపేజీ తరువాయి)

చర్చిస్తున్నట్లు తెలిసింది. అయితే, పాలన మూడు ముక్కలాటను తలపిస్తుండడం. నాయకులు ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండడమే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తప్పులను సరిదిద్దుకుని, ముఖ్య విషయాల్లో తప్పటడుగులు వేయకుండా ఆచితూచి ముందుకెళ్తేనే ప్రయోజనం ఉంటుంది. లేకుంటే అసలుకే మోసం వచ్చే పరిస్థితి కనిపిస్తోందనే ప్రచారం రాజకీయవర్గాల్లో జోరందుకుంది.

## చేసింది చెప్పుకోలేక ప్రజలను మెప్పించలేక!

నిజానికి గతంతో పోలిస్తే చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక, రాష్ట్రంలో కనీస మౌలిక సౌకర్యాలైన రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ పంపిణీ సహా వివిధ రకాల అభివృద్ధి పనులు ఆశాజనకంగానే సాగుతున్నాయి. ఇంకా విశాఖలో ఐటీ విప్లవం, ఎకనమిక్ సమ్మిట్, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చర్యలు, కలల రాజధాని అమరావతిలో జోరందుకున్న నిర్మాణ పనులు, అక్కడికి అంతర్జాతీయ విద్యాసంస్థల రాక, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన, పోలవరం ప్రాజెక్టు పనులు ఇలా ఆంధ్ర అభివృద్ధికి అవసరమైన అనేక చర్యలు ఊపందుకున్నాయి. వీటికితోడు గతంలో జగన్ ఇంట్లో ఒక్కరికే అమ్మఒడి ఇస్తే, మేం అందరికీ ఇస్తామంటూ తల్లికి వందనం అమలు చేస్తున్నారు. కేంద్రసాయంతో కలిపి జగన్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పేరుతో సంవత్సరానికి రూ.13,500 ఇస్తే, అన్నదాత సుఖీభవ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ప్రతి రైతుకూ సంవత్సరానికి రూ.20 వేలు అందజేస్తోంది. సామాజిక పింఛన్ 2వేల నుంచి 3 వేలకు పెంచేందుకు (రూ.250 చొప్పున 4సార్లు) జగన్ ప్రభుత్వం నాలుగేళ్ల సమయం తీసుకుంటే, కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే బకాయిలతో కలిపి రూ. 3 వేల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఇచ్చారు. ఇంకా పీ4 పేరిట పేదలని సమాజంలోని ఉన్నత కుటుంబాలు దత్తత తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు. జగన్ తన హయాంలో ఒక్క డీఎస్సీ ఇవ్వకున్నా, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ పేరుతో 16 వేల పైచిలుకు టీచర్ పోస్టులను భర్తీ చేసింది. ఇదే క్రమంలో కానిస్టేబుళ్ల నియామకాలు, గ్రూప్-1,2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలను సైతం కల్పించింది. అయితే ప్రభుత్వానికి జనంలో రావాల్సిన మైలేజ్ మాత్రం దక్కడం లేదు. లోతుల్లోకి వెళ్లి పరిశీలిస్తే, పరిపాలనలో లోపాలు, కీలక నిర్ణయాల్లో జాప్యం, నాయకుల్లో జవాబుదారీతనం లోపించడమే దీనికి కారణంగా కనిపిస్తోంది.

## సమన్వయం కరువు.. సమస్యల దరువు!

గతంలో చంద్రబాబు పాలనంటే.. నిక్కచ్చి నిర్ణయాలకు, సత్వర పరిష్కారాలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే వారు. అయితే ప్రస్తుతం కూటమిలో ఎవరికి వారే అన్న చందంగా అధికారం చెలాయించేందుకు పోటీ పడుతుండడంతో అటు ముఖ్య నిర్ణయాలు, ఇటు ప్రతిపక్షానికి చెక్ చెప్పే వ్యూహాలు రూపొందించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. ప్రధాన విధాన నిర్ణేతగా, కూటమికి పెద్దదిక్కుగా కీలక నిర్ణయాలన్నీ సాధారణంగా చంద్రబాబే తీసుకుంటారు. అయితే ప్రస్తుతం మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అంశాల్లో జోక్యం చేసుకుంటుండడం, చంద్రబాబు కూడా పొత్తు ధర్మాన్ని పాటిస్తూ, అటు పవన్ కల్యాణ్‌కి, ఇటు బీజేపీ నేతలకు కొంత ప్రాధాన్యత ఇస్తుండడంతో పుణ్యకాలం కాస్తా కర్పూరంలా కరిగిపోతూ అసలుకే ఎసరు తెస్తున్నట్లు కనిపిస్తోంది. గత కొంతకాలంగా చెప్పుకుంటున్న మంత్రివర్గ విస్తరణ విషయాన్నే తీసుకుంటే, ఇప్పటికే అనేక ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే బీజేపీ తరపున మరో కేబినెట్ బెర్త్ ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై క్లారిటీ లేదు. మరో స్థానం ఆశిస్తున్న జనసేన పార్టీ తరపున ఎమ్మెల్సీ నాగబాబుకు అవకాశం ఇస్తారా..? లేక మరో నేతకా..? అన్నది జవాబు దొరకని ప్రశ్నగా మారింది. దీంతో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోందనే ప్రచారం సాగుతోంది. ఇక తెలుగుదేశం విషయానికొస్తే, చంద్రబాబు గతంలో హామీ ఇచ్చిన నేతలకి, లోకేష్ ప్రాపకం కోసం పరితపిస్తున్న నాయకులకి కొదవ లేదు. వారిలో ఎవరికి ఇవ్వాలి..? ఎందరికి న్యాయం చేయాలనే విషయంపై స్పష్టత కరువైంది. దీంతో ఇన్నాళ్లు ఆశావహులుగా ఉన్న వారు ప్రస్తుతం అసంతృప్తికి లోనై ప్రతిపక్ష పార్టీల విమర్శలకు కనీసం కౌంటర్ ఇవ్వడానికి కూడా సుముఖత చూపడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అలాగే ఇంకా పూర్తి కాని నామినేటెడ్ పోస్టులు భర్తీ, కార్పొరేషన్ పదవులు వ్యవహారం కూడా పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తికి కారణంగా కనిపిస్తోంది.

ఇక తాజాగా కేంద్ర పార్లమెంట్‌లోని పెద్దల సభ అయిన రాజ్యసభలో త్వరలో ఖాళీకానున్న 4 స్థానాల వ్యవహారంలోనూ అటు చంద్రబాబు, ఇటు లోకేష్, పవన్ కల్యాణ్, బీజేపీ కేంద్ర పెద్దలు ఓ నిర్ణయానికి రాలేకపోతున్నట్లు తెలిసింది. దీంతో ఆశావహుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా తెలుగుదేశంలో దశాబ్దాలుగా చక్రం తిప్పిన యనమల రామకృష్ణుడు, కంభంపాటి రామ్మోహన్, గల్లా జయదేవ్, దేవినేని ఉమ, కనకమేడల రవీంద్రకుమార్, పిఠాపురం వర్మ, వర్ల రామయ్య వంటి పలువురు సీనియర్లు పెద్దస్థాయిలో లాబీయింగ్ చేస్తూ పోటీపడుతున్నారు. వీరిలో ఎవరికి బెర్త్ దక్కకున్నా వారు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది.

ఇక తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోకి వచ్చే ఎస్.వీ.బి.సితో సహా పలు ప్రధాన ఆలయాల్లో పాలకమండళ్లు, కార్య నిర్వహణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడమో, అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండడమో జరుగుతోంది. వీటిలోనూ లోకేష్, పవన్ కల్యాణ్ వంటి వారు జోక్యం చేసు కుంటుండడంతో చంద్రబాబు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు సమాచారం. ఇక టీటీడీ విషయానికి వస్తే కొత్త ఈవోగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర నిజాయితీకి మారుపేరుగా, క్రమశిక్షణకు నిలువుటద్దంగా పనిచేస్తారనే పేరుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి నుంచి రిలీవ్ చేయకుండానే అదనపు బాధ్యతలుగా టీటీడీ ఈవో పోస్టును కేటాయించారు. కాగా, ఇలాంటి నిజాయతీపరులైన, బాధ్యత కలిగిన అధికారుల విషయంలోనూ స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోవడం కూటమి ప్రభుత్వ నిర్ణయాల్లో చోటు చేసుకుంటున్న జాప్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. డ్యూటీలో నిబద్ధత కనబరుస్తూ బాధ్యతలను అత్యంత పకడ్బందీగా నిర్వహించే వివాదరహితులైన రవిచంద్ర వంటి సీనియర్ ఐఏఎస్‌లను టీటీడీ ఈవోగా పూర్తిస్థాయిలో నియమిస్తూ ఉత్తర్వులిస్తే ఇటు ప్రజల్లోనూ, అటు రాజకీయ పరంగానూ కూటమికి గొప్ప మైలేజ్ దక్కేది. కానీ, ఇలాంటి విషయాల్లోనూ ఆలస్యం జరుగుతుండడం విమర్శలకు కారణమవుతోంది. ఇక రాజకీయ కక్షలు, నాయకుల్లో సమన్వయ లోపం, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోవడం, రెడ్‌బుక్ ప్రతీకారం వంటి అంశాలన్నీ కూటమి నిర్ణయాల్లో జాప్యానికి కారణమవుతున్నాయి. అలాగే కొన్ని విషయాల్లో నిర్ణయం తీసుకున్నా, అమల్లో ఫెయిల్ అవుతున్నారు. దీంతో పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా కూటమి పార్టీలన్నీ ఇప్పటికైనా మేల్కొని, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్య నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి సమస్యలను ఎప్పటి కప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రతి పక్షానికి చెక్ చెప్పకుంటే, భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తప్పవని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఇక అసాంఘిక చర్యలు, విపరీత ప్రవర్తనతో కొందరు ప్రజాప్రతినిధులు దారితప్పుతుండడం కూడా తలనొప్పులు తీసుకొస్తూ, ప్రజల్లో కూటమి ప్రభను మసకబారుస్తోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అపర చాణుక్యుడు చంద్రబాబుకి "ఎవరికి వారు ...యమునా తీరు" అన్నట్లుగా వ్యవహరిస్తున్న కూటమి నేతల వ్యవహార శైలి తలనొప్పిగా మారిందనడంలో సందేహం లేదు....!

# ప్రైవేట్ ఆసుపత్రులకు..రిజిస్ట్రేషన్ ఉండాలి

## డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పష్టీకరణ

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులన్నిటికీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత స్పష్టం చేశారు. ఈనెల 10న నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌ల యజమానులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లు అన్నిటికీ రిజిస్ట్రేషన్ అవసరమన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా వాటిని నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. డెమో కనకరత్నం, డీపీఓ కె.రమేష్‌బాబు, ఏఎస్ఓ రమేష్, షైనీ, కల్యాణ్ పాల్గొన్నారు.

# కోటంరెడ్డి మాట..

# యువతకి వెలుగుబాట

- నాటి పోరాటం.. నేటికి ఫలించింది
- ఆమంచర్లలో 13.26 కోట్లతో..

ఇండస్ట్రియల్ పార్కు



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట.. త్వరలోనే రూరల్‌లోని నిరుద్యోగ యువత భవితకు వెలుగు బాటగా మారబోతోంది. ఈ నియోజకవర్గంలోని ఆమంచర్ల ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేయాలని కోరుతూ గత ప్రభుత్వంలో ఆయన పోరాటానికి దిగిన విషయం తెలిసిందే. నేటి కూటమి ప్రభుత్వంలో ఆయన కృషి ఫలించింది. ఆమంచర్లలో 59.61 ఎకరాల విస్తీర్ణంలో, 13కోట్లా 26లక్షల రూపాయల వ్యయంతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఇటీవలే శ్రీకారం జరిగింది. శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ఈ బృహత్తర కార్యక్రమం ఫలింపు దశకు వచ్చేస్తోంది. ఇప్పటికే తొలిదశలో దాదాపు 7 కోట్ల రూపాయల ఖర్చుతో 29.62 ఎకరాల్లో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ పనులు వగైరాలన్నీ పూర్తయ్యాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే ధ్యేయంతో ఏర్పాటుచేస్తున్న ఈ పార్కు నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. దీంతో, త్వరలోనే ఈ పార్కు ప్రారంభోత్సవం జరగబోతోందని అందరూ ఆశిస్తున్నారు. రూరల్ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా, తన ప్రతి మాటలోనూ, ప్రతి చర్యలోనూ ప్రత్యేకత చూపించే శ్రీధర్‌రెడ్డి ఈ పార్కు ఏర్పాటులో కూడా విశేష శ్రద్ధ తీసుకుంటున్నారు. అమరవీరుల త్యాగానికి గుర్తుగా ఈ పార్కుకు 'భారత్ సిందూర్ ఇండస్ట్రియల్ పార్కు' అని నామకరణం చేయబోతున్నారు.

# తలసీమియా బాధితునికి..

# బోన్‌మ్యారో చికిత్స!



ప్రాణాంతకమైన తలసీమియా వ్యాధితో బాధపడుతున్న ఓ ఆరేళ్ళ బాలునికి ఈనెల 16న బోన్‌మ్యారో చికిత్స జరగనుంది. నర్రవాడ మండలం తెడ్డుపోడు గ్రామానికి చెందిన టి.అన్విత్ కొంతకాలంగా తలసీమియా వ్యాధి తీవ్రమై నరక యాతన పడుతున్నాడు. గత మూడు సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ వైద్యులు ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ క్రమం తప్పకుండా తలసేమియా డే కేర్ వింగ్ ద్వారా ఉచిత రక్త మార్పిడితో పాటు అవసరమైన మందులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్వీత్‌కు బెంగళూరులోని భగవాన్ మహావీర్‌జైన్ ఆసుపత్రిలో ఈనెల 16న బోన్‌మ్యారో(ఎముక మజ్జ మార్పిడి) శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.35 లక్షల వ్యయం అవుతుందని అంచనా. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సిఫార్సుతో అన్విత్‌కు శస్త్రచికిత్స చేయనున్నారు. బాధితునికి గత మూడు సంవత్సరాలుగా నిరంతర సహాయం అందించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అన్విత్ తల్లిదండ్రులు ఈ సందర్భంగా తమ కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతమైతే అన్విత్‌కి ఇకపై తరచూ రక్త మార్పిడి అవసరం ఉండదని, ఇతర పిల్లల మాదిరిగానే సాధారణ జీవితం గడపగలడని ఐఆర్‌సీఎస్ తలసేమియా కేర్ సెంటర్ వైద్యులు భావిస్తున్నారు. శస్త్ర చికిత్స విజయవంతం కావాలని అందరూ కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్ చమర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, రాష్ట్ర శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు డాకారపు రవిప్రకాష్ పాల్గొన్నారు.


# 547 కోట్లతో.. శ్రీసిటీలో 'డైకిన్-రెచీ ఇండియా' ప్లాంట్!

- కొత్త ప్లాంట్‌కి భూమిపూజ.. 500 మందికి ఉపాధి అవకాశాలు



భూమిపూజ చేస్తున్న డైకిన్-రెచీ ఇండియా ఎం.డి కన్వల్‌జీత్, శ్రీసిటీ ఎం.డి డా. రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీలో డైకిన్-రెచీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఈనెల 11న తమ నూతన పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. జపాన్‌కు చెందిన డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తైవాన్‌కి చెందిన రెచీ ప్రెసిషన్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న డైకిన్-రెచీ కంపెనీలో ఏసీల విడిభాగాలు (రోటరీ కంప్రెసర్లు) ఉత్పత్తి చేయనున్నారు. 33.10 ఎకరాల్లో విస్తరించే ఈ ప్రాజెక్ట్ మొత్తం 1,33,000 చదరపు మీటర్ల నిర్మాణ విస్తీర్ణంతో మూడు దశల్లో అభివృద్ధి చేయబడుతుంది. తొలి దశలో 547 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 20 లక్షల రోటరీ కంప్రెసర్ల తయారీ సామర్థ్యం ఉండేవిధంగా ఏర్పాటు చేస్తారు. తద్వారా కనీసం 500 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తుది దశలో ఈ ప్లాంట్ 90 లక్షల యూనిట్లకు పెరుగుతుందని కూడా భావిస్తున్నారు. ఈ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమంలో డైకిన్ ఇండియా ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కన్వల్‌జీత్ జావా, డైకిన్-రెచీ ఇండియా డైరెక్టర్ సెకిదా నయోటో తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జావా మాట్లాడుతూ, ప్రధాని 'మేక్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్' లక్ష్యానికి అనుగుణంగా డైకిన్ ప్రయాణంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ ప్లాంట్‌కి అన్ని విధాల సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, శ్రీసిటీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఈ ప్లాంట్ ఏర్పాటుతో.. ఆంధ్రప్రదేశ్‌లో సులభతర, వేగవంతమైన వ్యాపార వ్యవస్థ పట్ల ముఖ్యమంత్రి నిబద్ధతను చాటుతుందని పేర్కొన్నారు. శ్రీసిటీని గ్లోబల్ ఇండస్ట్రియల్ హబ్‌గా బలపరుస్తుందన్నారు.



లాయర్
ఫిబ్రవరి 13, 2026

# పుట్టుకతోనే లోపాలు.. చిన్నారుల గుండెకు శాపాలు!

సాధారణంగా ఇంట్లో పెద్దవారికి గుండెకి సంబంధించి ఏదైనా చిన్న సమస్య వస్తేనే ఎంతో బాధపడిపోతుంటాం. అలాంటిది చిన్నపిల్లలకు అలాంటి జబ్బులేమైనా వస్తే..ఇక ఆ తల్లితండ్రులు, ఆ కుటుంబం పరిస్థితి ఎంత వేదనామయంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. తల్లి గర్భంలోనే జన్యులోపాలతో పిల్లలు ఉంటే, వారు పుట్టేటప్పటికి ఆ సమస్యలు మరింత పెద్దవై..వారి లేలేత గుండెలకి ప్రమాదకరంగా పరిణమిస్తుంటాయి. పుట్టుకతోనే చిన్నపిల్లలకి వచ్చే ఇలాంటి జబ్బులను వైద్యపరిభాషలో 'కంజెనిటల్ హార్ట్ డిసీజెస్' అంటారు. ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఒక్క ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఇలాంటి వ్యాధుల బాధల బారినపడి ఏటా వేలాదిమంది చిన్నపిల్లలు నరకయాతన పడుతున్నారని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చిన్నారుల గుండెకి చిల్లులు పడితే, ప్రతి నిమిషం వారు సరిగా శ్వాస తీసుకోలేక ఎంత అవస్తలు పడతారో చెప్పలేం. అందుకే, తల్లితండ్రుల్లో ఆ వ్యాధులపట్ల అవగాహన కలిగించేందుకు ఏటా ఫిబ్రవరి 7 నుంచి 12వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా 'సీహెచ్‌డీ అవేర్‌నెస్ వీక్'గా నిర్వహిస్తున్నారు. శిశువు గర్భంలో ఉన్నప్పుడే గుండె నిర్మాణం లేదా రక్తనాళాల ఏర్పాటులో లోపాలు ఏర్పడడం, గుండెలో రంధ్రాలు, వాల్వ్ సమస్యలు వగైరాలు వస్తుండడం ఎంతో దురదృష్టకరం. గర్భిణులు తినే ఆహారంలో సరైన పోషకాహారం లేకపోవడం, దీర్ఘకాలంగా మధుమేహవ్యాధి పీడితులు కావడం, ఊబకాయం, మద్యం-పొగాకు ఉత్పత్తులు వాడడం వంటి దురలవాట్లు కూడా అందుకు కారణమంటున్నారు వైద్యులు. మంచి విటమిన్లు ఉండే ఆహారాన్ని గర్భిణులు తీసుకున్నప్పుడే, వారికి పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారని అంటున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ అనేకమంది గర్భిణులు కడుపులో పిండం అభివృద్ధి చెందే దశలో సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల ఆ శిశువులకు రక్తనాళాలు సరిగా పనిచేయకపోవడం, గుండెకి రంధ్రాలు పడడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని వైద్యుల విశ్లేషణ. అధికశాతం మంది చిన్నారులకు పుట్టుకతోనే గుండెజబ్బులు వస్తున్నాయని, వాటిలో గర్భంలోనే రుబెల్లా వంటి ఇన్‌ఫెక్షన్‌లు అనేకం('కంజెనిటల్ హార్ట్ డిసీజెస్') చిన్నారులను పట్టి పీడిస్తున్నాయని నిపుణుల ఆవేదన. పుట్టిన బిడ్డలు సరిగా పాలు తాగలేకపోవడం, సరిగా శ్వాస తీసుకోవడం, చెమట పడుతుండడం, చర్మం నీలం రంగంలోకి మారడం, ఎక్కువగా ఏడుస్తుండడం వంటి లక్షణాలను తల్లితండ్రులు వెంటనే గమనించి, వైద్యులతో ఆరోగ్యపరీక్షలు చేయించాలని సూచిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర జబ్బుల విషయంలో సరైన సమయంలో సరైన చికిత్స అవసరం. తల్లితండ్రులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి ప్రమాదాలను ముందుగానే గ్రహించాలి. కానీ, మనదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా మూఢనమ్మకాలు సమసిపోలేదు. 'పుట్టుకతో వచ్చిన సమస్యలు పెద్దయ్యాక పోతా యిలే' అనే నిర్లక్ష్యభావంతో ఉండే వారూ లేకపోలేదు. ఇలాంటి అజ్ఞానంతో..తమకు తెలియకుండానే చేజేతులా తమ బిడ్డల జీవితాలకు తామే ఒక సమస్యగా పరిణమిస్తున్నారు కూడా. గుండెలకి రంధ్రాలు పడిన పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు అత్యవసరమవుతాయి. కనుక ఇలాంటి సందర్భాల్లో సొంత వైద్యాలు పనికిరావు. వైద్య నిపుణులు నిర్ధారించి ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలే తప్ప, తల్లితండ్రుల అనాలోచిత నిర్ణయాలు మంచిది కాదు. అంతేకాదు, మేనరికపు వివాహాల వల్ల పుట్టేబిడ్డలకు ఆరోగ్యసమస్యలు వస్తాయని ఏళ్ళతరబడిగా వైద్యులు చెప్తున్నా, పట్టించుకునేవారు లేరు. ఫలితంగా ఎందరో చిన్నారులు ఇలాంటి గుండెజబ్బులు..ఇతరత్రా అనారోగ్యాలకు గురవుతూనే ఉన్నారని వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో విషయం ఏమిటంటే, గర్భిణులు తెలిసో తెలియకో ఏ చిన్న ఆరోగ్యసమస్య వచ్చినా ఇష్టంవచ్చినట్లు యాంటీబయోటిక్స్ మందులు వాడేస్తుండడం కూడా కడుపులో బిడ్డలకి మరో పెద్ద సమస్య అవుతోంది. ఏదేమైనా, గర్భిణులు తమ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ పెట్టడం అన్నిటికన్నా ముఖ్యం. పిల్లలకు వచ్చే గుండె జబ్బుల విషయంలో మరింత జాగ్రత్తలు అవసరం. ప్రభుత్వాలు కూడా ఆమేరకు ప్రజల్లో చిన్నపిల్లల గుండె వ్యాధుల పట్ల అవగాహన కలిగించాల్సి ఉంది. ఇది ఏ ఒకరోజు సమస్యో కాదు..నిరంతరం ఉండేదే కనుక పాఠశాలల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ తరచూ ఉచిత ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తూ, గుండె జబ్బులతో బాధలు పడుతున్న చిన్నారులకి అవసరమైన చికిత్సలు చేయించాల్సి ఉంది. అంతే కాదు, బాధిత కుటుంబాల వారికి అన్నివిధాలా తమవంతు చేయూతనందించాల్సి ఉంది.

**(ఫిబ్రవరి 7 నుంచి 24 దాకా.. ప్రపంచ 'సీహెచ్‌డీ అవేర్‌నెస్' వారోత్సవాలు)**

# విద్యాసంస్థల యాజమాన్యాలు విజ్ఞతతో ఆలోచించాలి!

వివిధ విద్యాసంస్థల నిర్వాహకులు విజ్ఞతతో ఆలోచించండి. GenZ,GenX అంటూ వయస్సును సూచించే ఈ పదాలు వదిలెయ్యండి! ఎవడో Define చేసి మన నెత్తిన పారేస్తే వాటిని పట్టుకుని వేళ్ళాడుతూ అదే ఆధునికత అనే భావన విడనాడండి! అది పూర్తిగా "భావదాస్యం" మనకు బాల్యము, కౌమారము, యవ్వనము, మధ్య వయస్సు, వృద్ధాప్యం అనే పదాలున్నాయి. ఒక్కసారి ఆగి ఆలోచించడం నేర్చుకోండి. "Z" అనేది ఆంగ్ల వర్ణమాలలో ఆఖరు అక్షరం. మరి GEN అనే పదంతో యువతను ఎట్లా సంబోధిస్తారు? అంటే వృద్ధాప్యం అంటే కాస్త లాజిక్‌కు నిలిచేది... తల తోక లేని పిచ్చి పదప్రయోగాలతో భాషను నాశనం చేసి మెదళ్ళలో అయోమయం సృష్టించకండి. పసివారు యువతగా మారిన తరువాత అదుపు చెయ్యడం మన చేతిలో ఉండదు. బాల్య, కౌమార దశలలోనే అది చెయ్యాలి. అందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులే పూనుకోవాలి. అయితే వీరిని వారి కర్తవ్యం సక్రమంగా నిర్వర్తించకుండా వారి మెదళ్ళను అనవసర భావాలతో కలుషితం చేశాం.పిచ్చి గారాబం చేయడం వల్లనో, సరయిన దిశ చూపకపోవడం కారణంగానో, మన జ్ఞాన నిధులైన నీతి శతకాలు సరిగా బోధించకపోవడం చేతనో, ఎవరో ఒకళ్ళిద్దరు పిల్లలు విచ్చల విడి బూతుకు, నా వళ్ళు నా ఇష్టం అని పెట్రేగిపోవడానికి కారణాలు కావచ్చు. అంత మాత్రాన అందరిని ఒకే గాడికి కట్టేయడం సముచితం కాదు.

ప్రతి ఊరిలో పాతతరం పండితులు ఎవరో ఒకరు ఉంటారు. వారిని వెతికి పట్టుకొని నీతి శతకాలు, పంచతంత్రం.. వంటివి చెప్పించడం అన్ని స్కూల్ యాజమాన్యాలు ఒక ఉద్యమంగా తీసుకొని చేయాలి. అప్పుడే రాబోయే పదేళ్ళలో సమాజంలో సభ్యత అనేది నిలుస్తుంది. లేకపోతే పది బూతులు.. పది రీతులుగా పరిఢవిల్లిన సమాజాన్ని చూడవలసి వస్తుంది!

ఊటుకూరు జానకిరామారావు,
ఖమ్మం.




# చిన్నజీయర్ స్వామి వివాదాస్పద వ్యాఖ్యలు మానుకోవాలి!

దేశం నలుమూలల నాలుగు పీఠాలు స్థాపించింది ఆదిశంకరాచార్య కాదు అని చినజీయర్ స్వామి అనడం, శంకరాచార్య వైష్ణవుడని చెప్పడం వారి విభజన వాదనకు నిదర్శనం. వివాదాస్పద ప్రకటనలతో సంచలనాలు సృష్టించాలి అనుకోవడం ఈ కాషాయ వస్త్రధారికి తగదు. ఆదిశంకరాచార్యుల వారిని యావత్ హిందూ సమాజం జగద్గురువుగా పూజిస్తుంది. శంకరాచార్య వారు కేవలం శైవాన్ని ఆరాధనా మతంగా చూపలేదు. ఆయన శివకేశవ భేదములేని అద్వైత విధానాన్ని మార్గనిర్దేశం చేశారు. శివకేశవులకు భేదం లేదు అని చాటి చెప్పిన మహనీయుడు ఆదిశంకరుల వారు. దేశంలో కొన్ని విశ్వాసాలు ప్రబలంగా ఉండి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రోజుల్లో విగ్రహారాధనకు ప్రాధాన్యమిచ్చి షణ్మత స్థాపన చేసి షణ్మత స్థాపనాచార్యగా ప్రసిద్ధి చెందిన వారు జగద్గురు ఆదిశంకరుల వారు. ఆదిశంకరుల వారు 32 సంవత్సరాలు జీవించారు. హిమాలయాలకు వెళ్లి తిరిగి రాలేదు అనడం శుద్ధ తప్పు. హిందూ వాఙ్మయంలో ఆది శంకరుల వారు ఇచ్చినంత వైదిక ఆచార సంప్రదాయ గ్రాంథిక సంపదను ఎవ్వరూ ఇవ్వలేదు. జీయర్‌స్వామి వ్యక్తిగత అభిప్రాయం ఏదైనా, దేశంలో నలుమూలలా నాలుగు పీఠాలు స్థాపించి దేశాన్ని కాపాడింది నిస్సందేహంగా శంకరాచార్యులు వారు మాత్రమే! జీయర్ స్వామి తన వ్యక్తిగత ప్రచారం కోసం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మానుకొని, భేదాలు పక్కనబెట్టి విశాల హిందూ భావ వ్యాప్తికి ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, సింహపురి ధార్మిక సంస్థ.

# డిజిటల్ మాయాజాలానికి చరమగీతం!

మనసులో మాట 84

నేటి డిజిటల్ యుగంలో మనం దేనిని నమ్మాలి? కళ్ళ ముందు కనిపిస్తున్న వీడియో నిజమేనా? వింటున్న గొంతు మన ఆప్తుడి దేనా? ఈ ప్రశ్నలే ఇప్పుడు ప్రపంచాన్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. ఇటీవల (ఫిబ్రవరి 10, 2026) భారత ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఐటీ నిబంధనలు ఒక విప్లవాత్మక మార్పునకు నాంది పలికాయి. సోషల్ మీడియాలో ఏఐ సృష్టించిన ప్రతి కంటెంట్‌పై స్పష్టమైన 'లేబుల్' ఉండాలని, డీప్ ఫేక్ వీడియోలను కేవలం మూడు గంటల్లోనే తొలగించాలని కేంద్రం ఆదేశించింది. ఈ కొత్త నిబంధనల వెనుక ఉన్న ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెంచిన ప్రమాదాలు.

కొంతమందిలో ఉండే ప్రధాన భయం 'ప్రభుత్వ నిఘా'. ప్రభుత్వం మన వ్యక్తిగత విషయాలను గమనిస్తుందేమో అని ఆందోళన చెందుతారు. కానీ నేడు అంతకంటే భయంకరమైన శత్రువు మన ముందుకు వచ్చాడు. అదే 'డిజిటల్ భ్రమలు'. మీరు చూస్తున్న వీడియోలో ఒక నాయకుడు విద్వేష పూరిత ప్రసంగం చేస్తూ కనిపించవచ్చు. లేదా మీ స్నేహితుడు మిమ్మల్ని డబ్బులు అడగవచ్చు. కానీ అవి నిజం కాకపోవచ్చు. ఇలాంటి ఎన్నో వీడియోలను సృష్టించడానికి, నిజమని భ్రమింప చేయడానికి కృత్రిమ మేధతో ఆస్కారం ఉంది. 'గుర్తుతెలియని' అనేది ఒకప్పుడు సామాన్యుడికి రక్షణ కవచంలా ఉండేది, కానీ ఇప్పుడు అది నేరగాళ్లకు, సైబర్ ఉగ్రవాదులకు ఆయుధంగా మారింది. తన గుర్తింపును వెల్లడించకుండా ఎవరినైనా నాశనం చేయగలిగే శక్తి అనామకత్వానికి ఉన్నప్పుడు, ఆ అనామకత్వం మనకు అవసరమా? అన్నది ప్రశ్న.

'గ్రోక్ అరోరా' వంటి ఏఐ మోడల్స్ సృష్టించిన అరాచకం మనం చూశాం. కేవలం కొన్ని సెకన్లలోనే ఎవరినైనా కించపరిచేలా డీప్ ఫేక్ వీడియోలను సృష్టించడం, అబద్ధపు వార్తలను నిజమని నమ్మించేలా ఫోటోలను పుట్టించడం వంటివి సర్వ సాధారణమైపోయాయి. అందుకే కఠిన నిబంధనలు అనివార్యమయ్యాయి. ఈ నేపథ్యంలోనే, ఏఐ ద్వారా సృష్టించిన ప్రతి కంటెంట్‌పై స్పష్టమైన 'లేబుల్' ఉండాలని, బాధితులు ఫిర్యాదు చేసిన మూడు గంటల్లోనే ఆ కంటెంట్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశించింది.

ఏఐ ద్వారా సృష్టించిన సమాచారానికి ప్రభుత్వం తొలిసారిగా 'సింథటిక్ ఇన్ఫర్మేషన్' అని నామకరణం చేస్తూ చట్టబద్ధమైన నిర్వచనం ఇచ్చింది. ఈ నిబంధనలు ఫిబ్రవరి 20, 2026 నుండి అమల్లోకి వస్తాయి. తాజా నిబంధనలు కేవలం ఒక విధానపరమైన మార్పు మాత్రమే కాదు, మనం డిజిటల్ ప్రపంచాన్ని చూసే కోణంలో రావాల్సిన ఒక పెద్ద మార్పు.

## రక్షణ కవచమా? వినాశకర ఆయుధమా?

ఒకప్పుడు ఇంటర్నెట్ అంటే ఒక 'వైల్డ్ వెస్ట్' (నియమాలు లేని అడవి). అక్కడ ఎవరైనా తమ పేరును దాచుకుని స్వేచ్ఛగా మాట్లాడేవారు. ఎక్కడో ఒక మూల కూర్చుని, తన అసలు గుర్తింపును దాచుకుని, ప్రపంచంతో సంభాషించగలిగే సౌలభ్యాన్ని ప్రజాస్వామ్యానికి గొప్ప వరంగా చూశాం. కానీ, 2026 నాటి ఈ కాలంలో ఆ 'స్వేచ్ఛ' కాస్తా 'విచ్చలవిడితనంగా' మారిపోయింది. ఆ అనామకత్వమే ఒక ఆయుధంగా మారింది. ఎదుటివారి ముఖాన్ని మార్చేసి, లేని మాటలను ఉన్నట్లుగా సృష్టించే 'డిజిటల్ మాయాజాలం' పెరిగిపోయింది. అందుకే "అనామక ఇంటర్నెట్"కు పగ్గాలు వేయడమే సమాజానికి శ్రేయస్కరం.

## కేవలం 'లేబుల్స్' సరిపోవు

ఏఐ కంటెంట్‌పై లేబుల్ వేయడం మంచిదే, కానీ అది కేవలం ఒక హెచ్చరిక మాత్రమే. సిగరెట్ ప్యాకెట్‌పై 'ఆరోగ్యానికి హానికరం' అని రాసినంత మాత్రాన అలవాటు మారదు. మనకు కావాల్సింది ఒక సమూలమైన మార్పు. ప్రతి ఫోటో, ప్రతి వీడియో ఎక్కడ పుట్టింది, ఎవరు సృష్టించారు అనే 'డిజిటల్ పుట్టుక' రికార్డు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి. అంటే, ఒక వీడియో... కెమెరా నుండి వచ్చిందా లేదా సాఫ్ట్‌వేర్ నుండి పుట్టిందా అనే విషయాన్ని మన స్మార్ట్‌ఫోన్లే గుర్తించగలగాలి. ఇలా తెలుసుకోవడం అనేది ఒక హక్కుగా మారాలి.

## నిజాయితీ వైపు అడుగులు

స్వేచ్ఛ పేరుతో అబద్ధాలను ప్రచారం చేసే రోజులు పోవాలి. ఇంటర్నెట్... మన ప్రజాస్వామ్యాన్ని, వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేసే శక్తి. ఈ క్రమంలో అనామకత్వం కనుమరుగై, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వం వైపు మనం అడుగులు వేయాలి. "ఏదైనా సాధ్యం" అనే ఇంటర్నెట్ నుండి "నిజమైతేనే నమ్ముతాం" అనే ఇంటర్నెట్ వైపు సాగాల్సిన ప్రయాణం ఇది.

అనామక ఇంటర్నెట్ అంతమవ్వడం అంటే మన ప్రైవసీని కోల్పోవడం కాదు. అది బాధ్యతను పెంచుకోవడం. మనం రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఎలాగైతే బాధ్యతగా ఉంటామో, డిజిటల్ రహదారుల మీద కూడా అలాగే ఉండాలి. ప్రతి ఖాతాకు ఒక గుర్తింపు ఉండాలి, ప్రతి మాటకు ఒక బాధ్యత ఉండాలి. అప్పుడే మనం అబద్ధపు వీడియోల నుండి, విద్వేషపూరిత ప్రసంగాల నుండి మన సమాజాన్ని కాపాడుకోగలం. అనామకత్వం ఇచ్చే తాత్కాలిక స్వేచ్ఛ కంటే, వాస్తవికత ఇచ్చే భద్రతే ముఖ్యం. ఇంటర్నెట్ యొక్క 'వైల్డ్ వెస్ట్' కాలానికి ముగింపు పలికి 'డిజిటల్ సివిలైజేషన్' (డిజిటల్ నాగరికత) వైపు ప్రయాణించాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ కఠిన నిర్ణయాలు... ఆ దిశగా పడిన తొలి అడుగులు.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ఉత్తరక్రియలు



జననం
12-10-1956

నిర్యాణం
09-02-2026

ఆత్మీయదీప్తి, అనురాగమూర్తి,
మాకందరికీ స్ఫూర్తి, మా కుటుంబ కీర్తి,
మంచితనం మూర్తీభవించిన నిరాడంబర వ్యక్తి
ఎంతోమంది పేదవారికి ఉచిత వైద్యంతో
ఆపన్నహస్తం అందించిన సేవాతత్పరులు
మా పెద్దదిక్కు, మా దైవం

## డాక్టర్ వంగల నాగేశ్వరరెడ్డి

తేది. 09.02.2026 సోమవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకి సద్గతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : **డాక్టర్ కోటంరెడ్డి దేవసేన**
కుమార్తె : **డాక్టర్ విష్ణుప్రియ**
మరియు **కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు:** వారి **'పెద్దకర్మ'** తేది. **19.02.2026** గురువారం ఉదయం 11.00 గంటలకి బుచ్చిరెడ్డిపాలెం మెయిన్‌రోడ్డులోని **దేవి నర్సింగ్ హోమ్** నందు జరుగును. బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

# నగరాన్ని ప్రగతిపథంలో నడిపిస్తాం

## • ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ స్పష్టీకరణ



పురపాలక మంత్రి డాక్టర్ పి.నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సారధ్యంలో, అన్ని డివిజన్ల కార్పొరేటర్ల సహకారంతో, నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారుల పర్యవేక్షణలో నగరాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తామని ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలామ్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అన్ని డివిజన్‌ల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో అన్ని తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, అజెండాలోని అన్ని అంశాలు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆరోగ్య భద్రత, నగరాభివృద్ధి ధ్యేయంగా రూపొందించబడినవని తెలిపారు. డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లతో పాటు, కమిషనర్ వై.ఓ నందన్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి.. 3 లక్షల విరాళం



డాక్టర్ టి.లక్ష్మికి విరాళం చెక్కును అందజేస్తున్న డా.ఎస్‌సి సుబ్రహ్మణ్యం దంపతులు

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు డా. ఎస్‌సి సుబ్రహ్మణ్యం-విజయలక్ష్మి దంపతులు ఇటీవల 3 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాన్ని ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నాగేశ్వరరావులకు అందజేశారు.

# శ్మశానవాటికకి..2 లక్షల వితరణ




శ్రీనివాసులుని సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

నెల్లూరులోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక అభివృద్ధి, నిర్వహణ కోసం ఇటీవల నగరంలోని ఫత్తేఖాన్‌పేట నివాసి నారపనేని శ్రీనివాసులు 2 లక్షలు విరాళాన్ని రోటరీ సభ్యులకి అందించారు. వారి అమ్మా, నాన్నలు నారపనేని వీరాస్వామి - జయలక్ష్మిల స్మృత్యంకంగా ఆయన ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రొటేరియన్లు రాఘవేంద్రషెట్టి, మధుసూధనరావు తదితరులు దాత శ్రీనివాసులుని సత్కరించారు.






# నెల్లూరు కబుర్లు

## 16.70 కోట్లతో..

# వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం

### పనులను పరిశీలించిన మంత్రులు నారాయణ, ఆనం



నెల్లూరులోని మూలాపేట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలు ఇటీవల పరిశీలించారు. 16.70 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఆ నిర్మాణ పనులకు సంబంధించి ఆలయ నమూనా డిజైన్లను మంత్రులు పరిశీలించి, దేవాదాయ శాఖ అధికారులకు తగు సూచనలు చేశారు. ఇప్పటికే ప్రధాన ఆలయంతో పాటు నరసింహస్వామి ఆలయం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, భక్తుల సౌకర్యార్థం ఆలయానికి నాలుగు వైపులా విశాలమైన మాడవీధులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాబోయే 18 నెలల్లో ఆలయాన్ని పూర్తి చేసి భక్తులకు కానుకగా అందిస్తామని మంత్రులు స్పష్టం చేశారు. అనంతరం మంత్రులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పేదలకి అండగా నిలుస్తున్న.. ముఖ్యమంత్రి



లబ్ధిదారులకి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలను ఆదుకుంటున్న ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల ఆయన స్థానిక వేదాయపాళెంలోని తమ కార్యాలయంలో 38 మందికి మంజూరైన రూ.27.14 లక్షలకు సంబంధించిన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా సర్వేపల్లిలో నియోజకవర్గంలో ఇప్పటివరకు 672 మందికి రూ.6.28 కోట్ల సాయం లభించిందని, తద్వారా ఎంతోమంది బాధితులను ఆదుకున్నట్లయ్యిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం లబ్ధిదారులు సీఎంకి, సోమిరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# పండిట్ దీనదయాళ్ సంస్మరణ



దీనదయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మిడతల రమేష్

బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 57వ వర్ధంతి సందర్భంగా ఈనెల 11న స్థానిక మూలాపేటలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు నిరుపేదల అభ్యున్నతికి దీనదయాళ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. స్థానిక బీజేపీ నాయకులు అల్లూరు నాగేంద్రసింగ్, సుజనా, పద్మావతి, నరేష్, నాగలక్ష్మి, విజయశ్రీ, కే.శివకుమార్, టి.శ్రీనివాసులు, శ్రీకృష్ణ, జనార్ధన్, సుబ్బారెడ్డి, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో 13 నుంచి

# మహాశివరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకి సంబంధించిన ఆహ్వాన పత్రికలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 13 నుంచి 17వ తేది వరకు ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 15న మహాశివరాత్రి ఉత్సవం మరింత వేడుకగా నిర్వహిస్తారని, రాత్రి 10గంటలకు లింగోద్భవ అభిషేకం జరుగుతుందని చెప్పారు. భక్తులందరూ పాల్గొని స్వామివారిని-అమ్మవారిని దర్శించుకుని తరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆలయ సహాయ కమిషనర్- కార్య నిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గూడంశెట్టి దొరబాబు, బిరుదోలు చంటి, సిహెచ్ తేజ, రాపూరు రాధాకుమారి, నాటకరాణి చినపెంచలయ్య, కుల్లూరు వీర రాఘవేంద్ర, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం..

# 'నారాయణ.. హెల్త్ ఆన్ వీల్స్'



'నారాయణ.. హెల్త్ ఆన్ వీల్స్' వాహనంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లూరు నగర నిరుపేదల ఆరోగ్యమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నారాయణ హెల్త్ ఆన్ వీల్స్' వైద్య సేవలు పేదల పాలిట సంజీవనిలా మారాయి. సుమారు 3 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ మొబైల్ ఆసుపత్రి, మంగళవారం నాడు 48వ డివిజన్ మీరా మొహిద్దీన్ దర్గా సమీపంలో వైద్య శిబిరాన్ని నిర్వహించింది. డివిజన్ ఇంచార్జ్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ వాహనంలో 12 రకాల రక్త పరీక్షలు, ఎక్స్-రే, ఈసీజీ వంటి డయాగ్నోస్టిక్ సేవలతో పాటు, నిపుణులైన ఫిజీషియన్లు, కంటి వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా అత్యంత ఖరీదైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను కూడా ఈ శిబిరంలో ఉచితంగా నిర్వహిస్తుండటం విశేషం! వారానికి మూడురోజులు నగరంలోని వివిధ డివిజన్లలో పర్యటిస్తున్న ఈ సంచార వాహనం, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోంది.

# ఈత పోటీల్లో సత్తాచాటిన..నెల్లిపూడి



నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం దమ్మాయిపాళెం గ్రామానికి చెందిన నెల్లిపూడి శ్రీనివాసులు ఈనెల 8న విజయవాడలో నిర్వహించిన 26వ కృష్ణా రివర్ క్రాసింగ్ 1.5కిలో మీటర్ల ఈత పోటీల్లో తన సత్తా చాటుకున్నారు. విజయవాడ దుర్గా ఘాట్ నుంచి లోటస్ ఫుడ్ సిటీ ప్రకాశం బ్యారేజ్ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో నెల్లూరులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న 53 సంవత్సరాల నెల్లిపూడి శ్రీనివాసులు పాల్గొని కృష్ణానదిలో 1.5 కి.మీ దూరాన్ని 31 నిమిషాల 8 సెకండ్లలో ఈది ప్రముఖ అంతర్జాతీయ స్విమ్మర్ మరియు సీ స్విమ్మర్ గోలి శ్యామల నుంచి మెడల్‌ని, సర్టిఫికెట్‌ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు గోకరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల కష్టాలకి.. చలించిన పవన్!

## • బురదరోడ్డు నుంచి.. బడిపిల్లలకు విముక్తి



'పవన్ సార్ మాకు రోడ్డు వేయించండి.. ప్లీజ్ సార్.. ప్లీజ్ సార్' అంటూ చిన్నారులు విడుదల చేసిన వీడియో చిత్రం

రోడ్డు మంజూరు చేసిన అనంతరం పవన్ కళ్యాణ్‌కి థ్యాంక్యూ చెప్తున్న పిల్లలు




**'పవన్ సార్.. మా ఊరికి రోడ్డు వేయండి సార్!.. పవన్‌సార్.. ప్లీజ్ సార్ అంటూ పాఠశాల చిన్నారులు చేసిన విన్నపానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చలించిపోయారు. వారి బాధను వినగానే వెంటనే స్పందించారు. బడికి వెళ్ళేందుకు మరో దారి లేక ఆ బురదరోడ్డులోనే నడవలేక నడుస్తూ వెళ్తున్న ఆ విద్యార్థుల కష్టాలు తీర్చేందుకు ఆయన సమాయత్తమయ్యారు. జిల్లా అధికారులతో ఆ వివరాలు తెప్పించుకుని, వెంటనే రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీచేశారు. దాంతో, ఆ విద్యార్థులతో పాటు గ్రామస్తుల సంతోషం అంతా ఇంతా కాదు. వివరాలిలా ఉన్నాయి.**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కొండాపురం మండల పరిధిలోని గజ్జలవారిపల్లి గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడేవారు. వానలొస్తే చాలు, ఆ నీటితో మట్టిరోడ్డంతా బురదరోడ్డుగా మారుతుండడంతో అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టంగా ఉండేది. ఆ బురదలోనే నడుస్తూ, బడికి వెళ్లేందుకు తాము పడుతున్న ఇబ్బందులు చెప్పుకుంటూ తాజాగా వారు తమ స్కూల్ టీచర్‌తో కలసి సోషల్ మీడియాలో పెట్టిన వీడియో సందేశం ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి రావడం, వెంటనే ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడడం జరిగాయి. ఆ ప్రాంతంలో రోడ్డు వేయడానికి తగ్గ అంచనాలు రూపొందించి తక్షణం రోడ్డు మంజూరు చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.86 లక్షలతో అంచనాలు రూపొందించడం, వాటిని వెంటనే మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా రావడంతో ఆ పాఠశాల విద్యార్థులకే కాక, ఆ గ్రామ ప్రజలు, ముఖ్యంగా పంట పొలాలకి ఆ దారిన వెళ్లే రైతులకు ఎంతో ఉపశమనం కలిగించినట్లయింది. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గజ్జలవారిపల్లి విద్యార్థుల అభ్యర్ధనతో ఉప ముఖ్యమంత్రి పవవన్‌కల్యాణ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. అనంతరం, విద్యార్థులు 'థ్యాంక్యూ పవన్ సార్' అంటూ ప్లకార్డులతో పవన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



జపాన్ ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి

జపాన్‌లోని ఫుకోకా రాష్ట్రం లోని ఎఫ్‌ఎఫ్‌టిఏ (ఫుకోకా ఫారిన్ ట్రేడ్ అసోసియేషన్)కి చెందిన ఏడు గురు సభ్యుల విదేశీ వాణిజ్య ప్రతినిధి బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, పారిశ్రామిక సహకారం బలోపేతం లక్ష్యంగా ఎఫ్‌ఎఫ్‌టిఏ కార్యదర్శి జనరల్ మసాహిరో నిషియోరి నేతృత్వంలో శ్రీసిటీకి వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదరస్వాగతం పలికారు. ఫుకోకా రాష్ట్రంతో ఆర్థిక బంధాలను బలపరచడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదంటూ శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరిస్తూ..31 దేశాలకు చెందిన 240కు పైగా కంపెనీలు, వాటిలో 35కు పైగా జపాన్ సంస్థలతో శ్రీసిటీ గ్లోబల్ తయారీ కేంద్రంగా మారిందని ఆయన వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం, వాటి ప్రయోజనాలను శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బొడ్గాన్ జార్జ్ ప్రతినిధులకు విశదీకరించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎఫ్‌టిఏ కార్యదర్శి జనరల్ మసాహిరో నిషియోరి, దేశంలో అత్యంత ఆశాజనక పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ గుర్తింపు పొందిందని తెలిపారు.

# పర్వతరెడ్డిని కలిసిన..ఉపాధ్యాయ సంఘ నేతలు




పర్వతరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వైసీపీ నేత.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని, ఇటీవల ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నేతలు కలుసుకుని తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఉపాధ్యాయులు పిఆర్‌సి అమలుకు కమిటీ ఏర్పాటు చేసేలా..ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు తక్షణమే విడుదల చేసే విధంగా శాసనమండలిలో ప్రస్తావించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి.. తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.

# భక్తుల సేవే పరమావధిగా ఉండాలి

## • మూలస్థానేశ్వరాలయ నూతన పాలకమండలికి మంత్రుల సూచన



పాలకమండలి సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

భక్తుల సేవే పరమావధిగా ఉండాలని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డిలు సూచించారు. నెల్లూరు మూలాపేటలో ఉన్న శ్రీ భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవాలయం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం ఇటీవల వారి సమక్షంలో జరిగింది. పుట్టా అజయ్‌కుమార్‌రెడ్డి ఛైర్మెన్‌గా, మరో పదిమంది సభ్యులతో మంత్రులు నూతన పాలకమండలి సభ్యులను ప్రమాణం చేయించారు. పురపాలక మంత్రి నారాయణ మాట్లాడుతూ, గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ కోనేరు అభివృద్ధికి రూ.6.80కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. నూతన కమిటీ భక్తులకు సేవ చేయడంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈనెల 15 నుండి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని, ఆగమపండితుల సలహాల మేరకే ఆలయాల్లో పూజా కైంకర్యాలు సాగాలని చెప్పారు. అందరూ కలసి సమిష్టి కృషితో ఆలయ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ నందన్ పాల్గొన్నారు.


రెడ్డి వృద్ధాశ్రమం
REDDY OLD AGE HOME
27/1/14, 3వ వీధి - రాంజీనగర్ (చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా గుడి ఎదురు వీధి), నెల్లూరు.
చేరదలచిన వారు సంప్రదించండి. ఖాళీలు ఉన్నాయి.
బిరుదవోలు వెంకురెడ్డి
ఛైర్మెన్, వృద్ధాశ్రమం కమిటీ, సెల్:98850 99885
అన్నెం సుధాకర్‌రెడ్డి
వైస్‌ఛైర్మెన్, సెల్ : 94410 84401
అనుమారెడ్డి శరత్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్: 93473 55075
తూపిలి శ్రీధర్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్ : 98666 48284
శ్రీమతి ఇ.ధనూజరెడ్డి
కమిటీ సభ్యురాలు, సెల్: 96769 82625





# గూడూరు డివిజన్

## వాహనాలను తనిఖీ చేసిన ఆర్టీవో అధికారులు



గూడూరు పట్టణంలోని పోటుపాలెం జంక్షన్ వద్ద ఇటీవల ఆర్టీవో అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏ.ఎం.వి.ఐ ప్రభాకర్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లా రవాణాధికారి చందర్, గూడూరు ఉప రవాణాధికారి కిషోర్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా సుమారు 250 వాహనాలను తనిఖీ చేయగా, 21కేసులు నమోదు చేయడం జరిగిందని, దీనికిగాను రూ.1,06,500 అపరాధ రుసుము విధించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని, హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. ఫోర్‌వీలర్ డ్రైవింగ్ చేసేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు. ఏ.ఎం.వి.ఐ శాంతి తదితరులు పాల్గొన్నారు.

## తాళమ్మకు పొంగళ్ళు



గూడూరు గ్రామ దేవత తాళమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఈ నెల 8వతేదీ ఆదివారం పూజలు చేసి నెల పొంగళ్ళు సమర్పించారు. అమ్మవారు పలు రకాల పుష్పాలతో పూలంగి సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గూడూరు నుండే కాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## సందడిగా వివిఎస్ఆర్ పాఠశాల వార్షికోత్సవం





గూడూరు రెండో పట్టణం, వీరారెడ్డి పల్లిలోని వివిఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల 17వ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల జరిగాయి. ఈ వేడుకలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి పాశిం సంధ్యారాణి, నెల్లూరు నగర మాజీ మేయర్ భానుశ్రీ, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ చైర్మన్ మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విచిత్ర వేషధారణలతో చిన్నారులు అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిధుల చేత పతకాలు, మెమొంటోలు అందజేశారు. పాశిం సంధ్యారాణి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. విద్యార్థులు ఆటవిడుపుతో పాటు బాగా చదవాలని సూచించారు. మహాభారతం నాటకాన్ని కేవలం 20 నిమిషాల్లో అంతా చూపించారని, తనకెంతో నచ్చిందని ఆమె కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, డైరెక్టర్ బాలక్రిష్ణంరాజు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, చంద్రమోహన్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.











## బీసీల హక్కుల కోసం ఉద్యమించాలి

### ఏపీ-తెలంగాణ బీసీ సంఘాల సమావేశంలో బీఎంఆర్



బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, పక్కన కృష్ణయ్య తదితరులు


బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని రాజ్యసభ సభ్యులు బీఎంఆర్ (బీద మస్తాన్‌రావు) పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న ఢిల్లీలో బీసీల హక్కులు, సంక్షేమం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలనే లక్ష్యంతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ముఖ్యంగా పార్లమెంటులో బీసీ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని, రాష్ట్ర మరియు కేంద్ర చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు తప్పనిసరిగా సబ్ కోటా కల్పించాలన్న అంశంపై చర్చించడం జరిగింది. బీసీల నిజమైన జనాభా తెలుసుకోవాలంటే కులగణనలో, బీసీ కులగణనను పూర్తిస్థాయిలో నిర్వహించాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వంలో బీసీల సంక్షేమానికి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరింది. అంతేకాకుండా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించి, వారి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఎంఆర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న అన్యాయాలు, వివక్షపై పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం ఇంకా అందని ద్రాక్షగా మారిందని అన్నారు. బీసీల హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని బీసీ సంఘాలు, నాయకులు, ప్రజలు ఒక్కటై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలపై.. కలెక్టర్ సమీక్ష



జిల్లాలోని ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలన్నీ వాడుకలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వశాఖల బ్యాంకు ఖాతాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ఇన్‌యాక్టివ్‌గా ఉన్న అకౌంట్ల వివరాలపై సమీక్షించారు. వినియోగంలో లేని బ్యాంకు ఖాతాలు, నగదు నిల్వల వివరాలను ఎల్డీఎం మణిశేఖర్ కలెక్టర్‌కి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వెంటనే సంబంధిత శాఖ హెచ్‌వోడి రిక్వెస్ట్ లెటర్, ఆధార్, సిటిసి, ఐడి కార్డుతో ఆయా బ్యాంకుల్లో సంప్రదించి ఇన్‌యాక్టివ్ ఖాతాలను వాడుకలోనికి తీసుకురావాలని సూచించారు. ఖాతాల అవసరం లేకుంటే ఖాతాలను రద్దు చేయాలన్నారు. డిఆర్‌వో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి కార్యకర్తలే బలం



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, వారి సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వెంకటగిరిలోని తమ నివాసంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న స్థానిక, సంస్థాగత మరియు ప్రజా సమస్యలను ఆయన ఓపికగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులను నేదురుమల్లికి వివరించారు. వారి సూచనలు, అభిప్రాయాలను గౌరవంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలయపల్లి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

## దొంతాలి రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు రూరల్‌లోని ప్రతి గ్రామం అభివృద్ధికి ఇచ్చిన హామీల మేరకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారు. ఈనెల 8న దొంతాలి గ్రామంలో 40.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు మరియు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఆయన తన సోదరుడు.. టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూరల్‌లో కోట్లాది రూపాయల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. ఎన్నికలు లేనివేళ గ్రామాలలో జెండాలు, అజెండాలు పక్కనపెట్టి, పార్టీలకు అతీతంగా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు మీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడని ఆయన ప్రజలకు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలందరూ అండగా నిలబడాలని ఆయన కోరారు.

## శ్రీ కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామికి

# వైభవోపేతంగా వెండి నంది వాహనోత్సవం



జొన్నవాడ దేవస్థానంలో ఇటీవల శ్రీ మల్లికార్జున స్వామివారికి - శ్రీ కామాక్షితాయి అమ్మవారికి పెద్ద వెండి నంది వాహనోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు వైభవోపేతంగా నిర్వహించారు. శోభాయమానమైన పుష్పాలంకరణతో స్వామి-అమ్మవార్లు ఈ గ్రామోత్సవంలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. రంగురంగుల సుగంధ పుష్పాలతో చేసిన ప్రత్యేక అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామిని-అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు బండి నరసారెడ్డి-శైలజమ్మ దంపతులు ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, కార్యనిర్వాహణాధికారి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## జొన్నవాడ దేవాలయానికి..చెన్నై దాతల వితరణ

శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద వితరణకు దాతలు..చెన్నై వాస్తవ్యులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి-సుహాసిని దంపతులు ఇటీవల ఆన్‌లైన్ ద్వారా లక్షా ఒక్క వెయ్యి నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతల గోత్రనామాలతో ఆలయంలో వారికి ప్రత్యేక పూజలు చేయించారు.

# డా. శివశంకరయ్యకి..అరుదైన అవార్డు

## నూలుదారాలతో చిత్రకళకి..విజడమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు!



నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ చిత్రకారుడు, సారస్వత పరిశోధకుడు, ప్రత్యేకించి మహాకవయిత్రి మొల్లమ్మ సాహిత్యంపై విశిష్ట పరిశోధనలు చేసిన డా. మున్నెల్లి శివశంకరయ్య ఇటీవల అమెరికన్ 'విజడమ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'కు ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన ఆ సంస్థ అనుబంధ ప్రతినిధుల నుండి ఆమేరకు ఆయనకు సమాచారం అందింది. శివశంకరయ్య స్వగ్రామం మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామం. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా, చిత్రకళలో వినూత్నమైన రీతిలో నూలుదారాలతో ఆయన వివిధ దేవతామూర్తులు.. జాతీయనాయకుల ప్రతిమలను అద్భుతంగా రూపొందించడంలో ఆయన అసాధారణ ప్రజ్ఞావంతులు. దీంతో ఆయనలోని చిత్రకళా ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపికచేసినట్లు ఆ సంస్థ వారు తెలిపారు. ఈనెల 28 వ తేదీన తమిళనాడులోని హోసూరులో జరిగే కార్యక్రమంలో శివశంకరయ్యకు ఆ అవార్డును ప్రదానం చేయనున్నారు. డా. శివశంకరయ్యకి అంతటి అరుదైన గౌరవం కలుగుతున్నందుకు సహచర ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

# ఎన్‌బీకేఆర్‌లో జాబ్‌మేళా

## 86 మంది విద్యార్థులకు ఉద్యోగాలు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జాబ్‌మేళా జరిగింది. లక్ష్య ఫౌండేషన్-ఏపీ ప్లేస్‌మెంట్ మేనేజర్ దువ్వూరు భానుచంద్రారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో మొత్తం 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల అధినేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో కళాశాల కోఆర్డినేటర్ తిరుపతి రాజేశ్ 20కి పైగా వచ్చిన కంపెనీ ప్రతినిధులకు ఏర్పాట్లు చేశారు. జాబ్‌మేళాలో పాల్గొన్న వారిలో 86 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 45 మందిని షార్ట్‌లిస్ట్‌లో పెట్టారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఓ.చంద్రశేఖర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.దేవ, డా. గాది శ్రీనివాస్‌లు అభినందించి వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

## త్యాగరాజ కీర్తనలలో

# 'ధ్రువ' ప్రతిభ



నెల్లూరు బాలాజీనగర్‌లోని రామాలయంలో ఇటీవల జరిగిన త్యాగరాజస్వామి ఉత్సవాలలో ఆరేళ్ల బాలుడు ధ్రువ కుమార్ రాజు తన ప్రతిభ కనబరిచాడు. స్థానిక సెయింట్ జోసఫ్స్ స్కూల్‌లో ఫస్ట్‌క్లాస్ చదువుతున్న ఈ బుడతడిని నిర్వాహకులు అభినందించి సన్మానించారు.

## ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్‌గా..

# నరేంద్రబాబు!



నెల్లూరు వెంగళరావు నగర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూలులో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గుండాల నరేంద్రబాబు ఎన్‌సీసీలో ఉంటూ ఎంతోకాలంగా చేస్తున్న సేవలను గుర్తించి ఉన్నతాధికారులు ఆయనకు ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి కలిగించారు. నెల్లూరులోని 10- ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీలో ఆయన 2012 నుంచి 2013 వరకు కేర్ టేకర్ ఆఫీసర్‌గా, అనంతరం థర్డ్ ఆఫీసర్ హోదాలో 2021 వరకు పనిచేశారు. డిసెంబర్ 2021 నుంచి సెకండ్ ఆఫీసర్‌గా ఉంటూ విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించడం కోసం కృషి చేశారు. నవంబర్ 2025 నుంచి ఆయనకి ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ, 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌడన్నవే నుంచి ఈనెల 6న ఉత్తర్వులు అందాయి.

# 'నేర్చుకునే విధానం'.. నేర్చుకోవాలి!

జ్ఞాన నేత్రం — డా. నరసింహారెడ్డి ఊరిమిండి, Dallas, Texas, USA

**నేటి కాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు.. పుస్తకాల కొరత కాదు, సమాచారపు కొరత కాదు, అవకాశాల కొరత కాదు. అసలు సమస్య.. ఎలా నేర్చుకోవాలో తెలియకపోవడం. పుస్తకాలు పెరిగాయి, ట్యూషన్లు పెరిగాయి, వీడియోలు పెరిగాయి, కానీ నేర్చుకునే విధానం మాత్రం చాలామందికి స్పష్టంగా తెలియడం లేదు. చదువు అంటే పేజీలు తిప్పడం కాదు; అది మన మెదడు లోపల జరిగే ఒక శాస్త్రీయ ప్రక్రియ. ఆ ప్రక్రియను అర్థం చేసుకున్న విద్యార్థి ఏ విషయంలోనైనా మెరుగుపడతాడు. ఈ వారం మనం అదే విషయాన్ని పరిశీలిద్దాం.**

మన మెదడు ఒక అద్భుతమైన యంత్రం. అది ప్రతి రోజూ వేలాది సమాచారాలను స్వీకరిస్తుంది, వడపోత చేస్తుంది, నిల్వ చేస్తుంది, అవసరమైనప్పుడు తిరిగి తీసుకొస్తుంది. ఈ మొత్తం ప్రయాణం మూడు దశల్లో జరుగుతుంది. ఎన్‌కోడింగ్, స్టోరేజ్, రిట్రీవల్. 'ఎన్‌కోడింగ్' అంటే మనం చదివినది, విన్నది, చూసినది మెదడు మొదటిసారి గ్రహించే దశ. 'స్టోరేజ్' అంటే ఆ సమాచారాన్ని మెదడు లోపల నిల్వ చేయడం. 'రిట్రీవల్' అంటే పరీక్షలో లేదా జీవితంలో ఆ సమాచారాన్ని తిరిగి గుర్తు చేసుకోవడం. ఈ మూడు దశల్లో ఏదైనా బలహీనమైతే చదువు ఫలితం తగ్గిపోతుంది. అందుకే 'చదివాను.. కానీ గుర్తులేదు' అనే బాధ చాలామందికి ఉంటుంది.

మన మెదడు ఒక ఆసక్తికరమైన నిజాన్ని చెబుతుంది. పాసివ్ లెర్నింగ్ పని చేయదు. పుస్తకం తెరచి గంటలతరబడి చూస్తూ ఉండటం, హైలైట్ చేయడం, అండర్‌లైన్ చేయడం, వీడియోలు వరుసగా చూడడం - ఇవన్నీ మనకు 'చదివినట్లే'అనిపిస్తాయి కానీ..మెదడు వాటిని లోతుగా నిల్వచేయదు. ఎందుకంటే మెదడు నేర్చుకోవడానికి చురుకుగా పాల్గొనాలి. ప్రశ్నలు అడగాలి, గుర్తు చేసుకోవాలి, తప్పులు చేయాలి, మళ్లీ ప్రయత్నించాలి. ఇదే నిజమైన నేర్చుకోవడం.

ఈ రోజుల్లో విద్యార్థుల పెద్ద శత్రువు డిస్ట్రాక్షన్. ఫోన్ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా, చిన్న వీడియోలు.. ఇవన్నీ మెదడు దృష్టిని చిన్నచిన్న ముక్కలుగా విడదీస్తాయి. దృష్టి విరిగితే ఎన్‌కోడింగ్ బలహీనమవుతుంది; దాంతో స్టోరేజ్, రిట్రీవల్ కూడా ప్రభావితమవుతాయి. అందుకే "చదివాను..కానీ గుర్తు లేదు" అనే సమస్యకు ప్రధాన కారణం దృష్టి చెదరడం. ఈ కాలంలో దృష్టిని కాపాడుకోవడం ఒక కీలక నైపుణ్యం. మన మెదడు మరో నిజాన్ని చెబుతుంది. మనం మర్చిపోవడం సహజం. చదివిన వెంటనే గుర్తుంటుంది, కానీ కాలం గడిచేకొద్దీ అది తగ్గిపోతుంది. దీనిని 'ఫర్గెటింగ్ కర్వ్' అంటారు. కానీ దీన్ని ఎదుర్కొనే శాస్త్రీయపద్ధతులు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది స్పేస్డ్ రిపిటిషన్. అంటే ఒకే విషయాన్ని వరుసగా చదవడం కాదు; కొంత విరామంతో మళ్లీ మళ్లీ చదవడం. ఈ విధానం మెదడులో బలమైన న్యూరల్ కనెక్షన్లు ఏర్పరుస్తుంది.

ఇంకో శక్తివంతమైన పద్ధతి యాక్టివ్ రీకాల్. పుస్తకం మూసిపెట్టి మనకు గుర్తున్నదాన్ని మనమే చెప్పుకోవడం, రాయడం, ప్రశ్నలు వేసుకోవడం..ఇవన్నీ దీనిలో భాగమే. ఇది మెదడును శ్రమపెట్టిస్తుంది, ఆ శ్రమే నేర్చుకోవడాన్ని బలపరుస్తుంది. పాసివ్ రీడింగ్ సౌకర్యంగా ఉంటుంది; యాక్టివ్ రీకాల్ మాత్రం ఫలితాలు ఇస్తుంది. మన మెదడు భావోద్వేగాలను కూడా నేర్చుకునే ప్రక్రియలో భాగం చేస్తుంది. ఆసక్తి కలిగించే విషయాలు, జీవితానికి దగ్గరగా ఉన్న ఉదాహరణలు మెదడులో బలంగా నిలుస్తాయి. అందుకే మంచి గురువు పాఠాన్ని కథలా చెబుతాడు. భావోద్వేగం లేకుండా నేర్చుకోవడం ఎండిపోయిన నేలలో విత్తనం వేసినట్లే. ఈ కాలంలో మరో సమస్య..ఓవర్‌లోడ్. చాలాసమాచారం, చాలా ఒత్తిడి. కానీ మన మెదడు ఒకేసారి చాలా విషయాలను గ్రహించదు. అది చిన్న చిన్న భాగాలుగా నేర్చుకుంటుంది. అందుకే 'చంకింగ్' అనే పద్ధతి పనిచేస్తుంది. పెద్ద విషయాన్ని చిన్న భాగాలుగా విభజించి అర్థం చేసుకోవడం. చదువులో నిద్ర పాత్ర కూడా కీలకం. నిద్రలో ఉన్నప్పుడు మెదడు రోజంతా నేర్చుకున్న సమాచారాన్ని క్రమబద్ధం చేస్తుంది. నిద్ర లేకపోతే స్టోరేజ్ బలహీనమవుతుంది. నిద్ర చదువుకు శత్రువు కాదు; అది చదువుకు మిత్రుడు..అని గ్రహించాలి.

### చదువు.. అదొక పోటీ కాదు.. ప్రయాణం..

ఈ రోజుల్లో విద్యార్థులు ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నారు..చదువు ఒక పోటీ కాదు; అది ఒక ప్రయాణం. ప్రతి విద్యార్థి మెదడు వేరు, నేర్చుకునే వేగం వేరు, ఆసక్తులు వేరు. అందుకే మనం మన ప్రయాణాన్ని మనమే అర్థం చేసుకోవాలి. మన బలాలు, మన బలహీనతలు, మన శైలి..ఇవన్నీ తెలుసుకోవడం నేర్చుకునేశాస్త్రంలో భాగమే. ఇతరులతో పోల్చుకోవడం మన మెదడుకు అన్యాయం.


ఈ వారం మీరు ఒక చిన్న ప్రయోగం చేయండి. మీరు చదివే ఏ విషయాన్నైనా ఈ మూడు ప్రశ్నలు అడగండి - "నేను దీన్ని అర్థం చేసుకున్నానా?", "నేను దీన్ని గుర్తుంచుకోగలనా?", "నేను దీన్ని ఉపయోగించగలనా?". ఈ మూడు ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పగలిగితే, మీరు నిజంగా నేర్చుకుంటున్నారు. లేకపోతే పద్ధతిని మార్చాలి. మన కాలానికి అవసరమైన విద్యార్థి ఎక్కువగా చదివేవాడు కాదు; సరైన విధంగా నేర్చుకునేవాడు. శాస్త్రం మనకు మార్గం చూపుతుంది. మనం ఆ మార్గంలో నడిస్తే, ఏ సబ్జెక్టు కష్టంగా అనిపించదు. ఏ పరీక్ష భయంకరంగా అనిపించదు. ఏ లక్ష్యం దూరంగా అనిపించదు. నేర్చుకునే శాస్త్రాన్ని అర్థం చేసుకున్న విద్యార్థి, తన భవిష్యత్తును తన చేతులతో నిర్మించుకోగలడు.

వచ్చే వారం: ఆచరణ, ఏకాగ్రత, పట్టుదల, నిబద్ధత- విద్యార్థి విజయానికి నాలుగు మూలస్తంభాలు.



E-mail: reddyu@gmail.com

# కల్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు తాటిపర్తి మోహన్‌రెడ్డి - ఉషల కుమారుడు
ఉదయ్ శంకర్‌రెడ్డి - స్వార్తిరెడ్డి (నెల్లూరు వాస్తవ్యులు తురిమెర్ల హరేంద్రరెడ్డి - శిరీషల కుమార్తె)ల
వివాహం ఫిబ్రవరి 8వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభ దీవెనెలు.

# కృష్ణాతీరంలో.. చిన్ని నారాయణరావుకి సత్కారం



విజయవాడలో ఇటీవల ఎన్టీఆర్‌జిల్లా యంత్రాంగం-పర్యాటక శాఖ, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వాహకులు కలిమిశ్రీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 'కృష్ణాతీరం - కవితా హారం'లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావును నిర్వాహకులు సత్కరించారు. అక్కడ జరిగిన కవితాగానంలో ఆయన రచించిన 'ప(ని)డవ జీవులు' అనే 'కవిత అందరి ప్రశంసలందుకుంది. రాష్ట్ర పర్యాటకమంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని కవి నారాయణరావును సత్కరించారు.

# ఉత్సాహంగా.. 'కృష్ణచైతన్య' వార్షికోత్సవ వేడుకలు





నెల్లూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు ఈనెల 11న స్థానిక అనీల్ గార్డెన్స్‌లో ఉత్సాహంగా జరిగాయి. కృష్ణచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ ఆర్.వి.కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ పర్వతరెడ్డి రాణాప్రమోద్‌రెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లు అతిధులకు గౌరవ వందనం సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలు పాటలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. విద్యారంగంలో ప్రతిభతో ముందుకు సాగుతూ, గత 27 సంవత్సరాలుగా కృష్ణచైతన్య విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు-తల్లితండ్రుల సహకారంతో విద్యాసంస్థలు మంచిపేరు తెచ్చుకున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు ప్రతి ఏటా గోల్డ్ మెడల్ అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణచైతన్య విద్యాసంస్థలంటే నాణ్యమైన విద్యకు పేరన్నారు. తక్కువ ఫీజులతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందించేందుకు.. కృష్ణచైతన్య యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. విద్యాసంస్థల డీన్లు రామాంజనేయులురెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, సుధారాణి, పాయసం రమేష్, కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




ఈనెల 8న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్‌భవన్‌లో చెట్టు=తల్లి', 'నాన్న' షార్ట్‌ఫిల్మ్‌లకు ఉత్తమ అవార్డులు అందుకుంటున్న 'కళాంజలి' అనంత్, ప్రముఖ నటులు డా. కెకె రామచంద్రమూర్తి, మునిచంద్ర. పక్కన నిర్వాహకులు రషీద్, ప్రముఖ సినీనటులు సాదనాల వెంకటస్వామినాయుడు, తెలంగాణ గాయని వలజ బలుసాని, సిహెచ్ఎం చారి తదితరులు.

## కందుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

# ఎన్‌సిసి యూనిట్‌ను పునరుద్ధరించండి

- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి



కందుకూరు పట్టణంలో ఉన్న టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో ఉన్న ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) యూనిట్‌ని పునరుద్ధరించాలని కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 11న ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. 1964లో ఏపీలోని కందుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి యూనిట్ ఏర్పడిందని, ఆ విభాగం నుంచి చాలామంది క్యాడెట్లు భారత సైన్యం, పోలీసు శాఖ వంటి వాటిలో చేరి సేవ చేస్తున్నారన్నారు. అయితే, కళాశాల పరిపాలనలో లోపం కారణంగా శాశ్వత అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ (ఏఎన్ఓ) అందుబాటులో లేకపోవడంతో 2023లో ఆ కళాశాల నుండి ఆ యూనిట్‌ను ఉపసంహరించారని, దీంతో శిక్షణ పొందాలనుకునే క్యాడెట్‌లకు ఎన్‌సీసీ దూరమైందన్నారు. మళ్లీ ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయగలిగితే నేవీ శిక్షణతో పాటు తీరప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆ వినతికి స్పందించిన రాజ్‌నాథ్‌సింగ్ ఎన్‌సిసి యూనిట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఎంపీకి తెలిపారు.

### సాగర్ మిత్ర సేవలను కొనసాగించండి :

నెల్లూరు జిల్లాలో మత్స్యశాఖ కింద పనిచేస్తున్న సాగర్‌మిత్రల సేవలను కొనసాగించాలని ఎంపీ వేమిరెడ్డి కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఇటీవల కేంద్రమంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసిన ఎంపీ.. ఆంధ్రప్రదేశ్ సాగర్‌మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ తరపున వినతి పత్రం అందజేశారు. పీఎంఎంఎస్‌వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన) కింద నియమించబడిన సాగర్‌మిత్ర సేవలు వచ్చే మార్చి31 నాటికి ముగియనున్నాయని, ఫేజ్-1 మూసివేతకు రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేయబడిందన్నారు. ఈ దశలో వారి సేవలను అకస్మాత్తుగా నిలిపివేయడం వల్ల పీఎంఎంఎస్‌వై కింద సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 31.03 .2026 తర్వాత వారి సేవలను పొడిగించడానికి ఇప్పటికే వివరణాత్మక ప్రతిపాదనలను సమర్పించిందని, కావున సాగర్ మిత్రల పదవీ కాలాన్ని మరింత కాలం పొడిగించడాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్.. సాగర్ మిత్రల సేవలను కొనసాగించేలా చూస్తామని చెప్పారు.

# గూడూరు అభివృద్ధికి సహకరించండి

- లోకేష్‌కి ఎమ్మెల్యే పాశిం విజ్ఞప్తి



గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర విద్యా, ఐటి శాఖామంత్రి నారా లోకేష్‌ని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. ఈ నెల 11న అమరావతిలో మంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు.

## శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# ప్రాథమిక చికిత్సలపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు ప్రథమిక చికిత్సలపై శిక్షణనిస్తున్న మంగళగిరి ఎయిమ్స్ వైద్య సిబ్బంది

శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రాథమిక చికిత్సలపై రెండు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. మంగళగిరి ఎయిమ్స్ వైద్య సిబ్బంది సహకారంతో శ్రీసిటీ పరిధిలోని హైస్కూళ్లలో ఈ శిక్షణ నిర్వహించారు. ఇందులో ప్రాణరక్షణకు సంబంధించిన కీలక అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఇరుగుళం జడ్పీ హైస్కూల్, చిన్మయా విద్యాలయలలో ఈ కార్యక్రమం నిర్వహించగా, అకార్డ్ స్కూల్, శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లలో జరుగనుంది. మంగళగిరి ఎయిమ్స్‌కు చెందిన సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ ఎస్.ధనీష్‌కృష్ణన్ నేతృత్వంలో వైద్య నిపుణులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. గుండె నొప్పి బాధితులను రక్షించేందుకు చేసే ప్రాథమిక చికిత్స సీపీఆర్, ముక్కు రక్తస్రావం, ఫిట్స్, శ్వాస సరిగా అందకపోవడం(చోకింగ్), పక్షవాతం, పాము కాటు, కుక్కకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను ఈ శిక్షణలో వివరించారు. ఇరుగుళం స్కూల్ ఆవరణలో మాదనపాలెం, ఇరుగుళం జడ్పీ హైస్కూల్స్‌కు చెందిన 250 మంది శిక్షణకు హాజరుకాగా, 100 మందికి పైగా విద్యార్థులు ప్రత్యక్ష శిక్షణలో పాల్గొన్నారు. చిన్మయ విద్యాలయానికి చెందిన 150మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి ఎయిమ్స్ బృందాన్ని అభినందించారు.

# మహాపుణ్యప్రదం.. ముక్కంటి దర్శనం

## శ్రీకాళహస్తిలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



దక్షిణ కాశీగా పేరొందిన సుప్రసిద్ధ శైవక్షేత్రం.. తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి లోని శ్రీ జ్ఞానప్రసూనాంబికాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 10 నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 23వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వ రాలయ కార్యనిర్వాహణ అధికారి బాపిరెడ్డి, ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, సభ్యులు కోలా వైశాలి, స్రవంతి, లక్ష్మీనారాయణ, లక్ష్మమ్మ, గోపీనాథ్, కుసుమ కుమారి, రజిని, నాగరాజు, హైమావతి, విజయమ్మ, కౌసల్యమ్మ, రాఘవయ్య, మురళి, గుర్రప్ప శెట్టి, సావిత్రి, ఎక్స్ అఫిషియో సభ్యులు సంబంధం గురుకుల్ తది తరుల పర్యవేక్షణలో ఈ బ్రహ్మోత్సవాలు కన్నులపండు వగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా 13 రోజుల పాటు ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఆలయం లోపల నిర్వహించే ప్రత్యేక రూ. 2500, రూ. 5000 రాహుకేతు పూజలను కూడా రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తొలిరోజు 10వతేదీ శ్రీ కన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 11వ తేదీ శ్రీ స్వామి వారి ధ్వజారోహణోత్సవం, 12న సూర్యప్రభ-చప్పర వాహనసేవ, భూత-శుక వాహనసేవలు జరిగాయి. అదేవిధంగా 13న హంస-యాళివాహన సేవలు, రావణ-మయూర వాహనసేవలు, 14న హంస-శుక వాహనసేవ, శేషవాహనం-యాళి వాహనసేవ, 15న ఇంద్ర విమానం-చప్పరసేవ, నంది-సింహ వాహనసేవలు, 16న రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం నేత్రపర్వంగా నిర్వహిస్తారు. 17వ తేదీ అధికార నంది-కామధేనువు వాహనసేవ, గజ-సింహ వాహనసేవలు, 18న రుద్రాక్ష అంబారి వాహనసేవ, 19న బనాత అంబారి వాహనసేవ, అశ్వ-సింహ వాహనసేవలు ఉంటాయి. 20వతేదీ తీర్థవారి ధ్వజావ రోహణం, కేడిగ వాహనసేవ, రాత్రికి సింహ-కామ ధేనువు వాహనసేవ, 12న పల్లకిసేవ జరుగుతాయి. 22వ తేది ఉదయం 9.30 గంటలకు శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

# పరిశోధనల శిఖరం.. డా. అనుమకొండ

## • ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల్లో.. మన నెల్లూరీయుడు



నానో ఔషధ పరిశోధనల్లో ప్రపంచస్థాయిలో ఉత్తమ శాస్త్రవేత్తగా రాణిస్తున్నారు.. నిరంతర పరి శోధకునిగా.. 75 సంవత్సరాల వయస్సులోనూ క్రియా శీల పరిశోధనలు కొనసాగిస్తూ ఆయన అందరి ప్రశం సలు అందుకుంటున్నారు. ఆయనెవరో కాదు..మన నెల్లూరీయులు, విశ్రాంత ఆచార్యులు, ప్రఖ్యాత శాస్త్రవేత్త.. డా. అనుమకొండ వరదరాజులు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం వారు ఇటీవల రూపొందించిన ప్రపంచంలోని అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా ఐదు సంవత్సరాలు (2021-2025) ఆయన చోటు దక్కించుకోవడం ఆయన పరిశోధనా ప్రావీణ్యానికి నిదర్శనం. సింహపురి సీమకే గర్వకారణం.

నెల్లూరులోని వీఆర్ కళాశాలలో ఆయన చదువుకు న్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఎస్సి, పీహెచ్‌డీ పూర్తిచేశారు. అనంతరం అనంత పురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోధన మరియు పరిశోధనల్లో సేవలందించి 2010లో పదవీ విరమణ చేశారు. ఆ తరువాత కూడా ఆయన పరిశోధనా ప్రయాణం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. పర్యావరణా నికి హాని కలగని పదార్థాలు, నానో కంపోసిట్లు, మరియు భారతీయ సంప్రదాయ పదార్థాల ఆధారిత నానోమెడిసిన్ రంగాలలో ఆయన చేసిన పరిశోధనలు విశేష ప్రాముఖ్యతను సంతరించుకు న్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు థాయిలాండ్ మరియు భారత ప్రభుత్వాల నుండి పలు పేటెంట్లు లభించాయి. ముఖ్యంగా యాంటీ-బాక్టీరియల్ నానో కంపోసిట్లు, వైద్య వినియోగానికి అనువైన నూలు వస్త్రాలు, కాలేయ కాన్సర్ కణాలను సమర్థవంతంగా నశింపజేసే నానో ఔషధాల అభివృద్ధిలో ఆయన పరిశోధనలు కీలకమైన మైలురాళ్లుగా నిలిచాయి. ఇప్పటి వరకు ఆయన 250కు పైగా అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించడమే కాక, ఎఫ్ఆర్ఎస్‌సి(లండన్) మరియు చార్టర్డ్ ఎన్విరాన్మెంటలిస్ట్ వంటి గౌరవ సభ్య త్వాలను పొందారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉ త్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని కూడా అందు కున్నారు. భవిష్యత్తులో భారతీయ సంప్రదాయ ఔషధ గుణాలున్న పదార్థాలను ఆధునిక నానో సాంకేతికతతో సమన్వయం చేసి, సమాజానికి ఉపయోగపడే సురక్షిత మైన, ప్రభావవంతమైన నానో ఔషధాలను అభివృద్ధి చేయడం ధ్యేయంగా ఆయన అవిశ్రాంతంగా పని చేస్తుండడం గొప్ప విశేషం..వర్ధమాన పరిశోధకులకు ఆయన కృషి మార్గదర్శకం కూడా.

# నూరేళ్ళ క్రితమే చిత్రసీమలో అద్భుతాలు సృష్టించిన.. వైవీ రావు!

**దా**దాపు నూరేళ్ళ క్రితమే చలనచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, తన అపూర్వ మేధాశక్తితో ఎన్నో అద్భుతాలు సృష్టించిన మొట్టమొదటి నెల్లూరీయులు యరగుడిపాటి వరదారావు(వైవీ రావు). తొలినాళ్ళ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు అపూర్వం..అపారం. వారి ప్రజ్ఞాపాటవాలు సింహపురి సీమకే గర్వకారణం. చిత్రసీమలో లైట్ బాయ్ దగ్గర నుంచి కథా రచయితగా, గాయకునిగా, పంపిణీదారుగా, దర్శకునిగా, నిర్మాతగా మరియు నటునిగా కూడా అద్వితీయంగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. 1926లోనే చిత్ర పరిశ్రమలో ప్రవేశించి మూకీ-టాకీల యుగంలోనే అప్పట్లో ఏడు భాషల్లో విజయవంతమైన సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాలు నిర్మించిన ఘనాపాటి..మన వైవీ రావు.



### రంగస్థలంపై ఎనలేని ఆసక్తి :

వైవీ రావు 1903 మే 30న నెల్లూరులో జన్మిం చారు. భూదేవమ్మ, గోపాలకృష్ణయ్య వీరి తల్లిదండ్రులు. అప్పట్లో వీరు నెల్లూరులోని రంగనాయకులపేట ప్రాం తంలో నివసించేవారు. డాక్టర్ కావాలనే ఆకాంక్షతో మద్రాసులో చదువుకుంటున్న వైవీరావు, హఠాత్తుగా తండ్రి మరణంతో చదువుకు స్వస్తి చెప్పి తనకు ఇష్టమైన నాటక రంగం వైపు దృష్టి సారించారు. ప్రఖ్యాత పండితులు వేదం వెంకటరాయశాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయం, బొబ్బిలి యుద్ధం చారిత్రక నాటకాల ప్రదర్శన ఆయనకెంతో కీర్తిని తెచ్చిపెట్టాయి. సినిమాల్లో నటించాలనే కోరికతో బొంబాయి వెళ్ళి దర్శకులు మణిలాల్ జోషిని కలిసి మూకీ చిత్రాలలో నటించే అవకాశం దక్కించుకున్నారు.

### ఆణిముత్యాలాంటి చిత్రాలు :

1926 నుంచి 1970వ దశకం తొలినాళ్ల వరకు వైవీరావు సినీ ప్రస్థానం అద్భుతంగా సాగింది. తెలుగు సినిమా పితామహుడు రఘుపతి వెంకయ్యనాయుడు కుమారుడు రఘుపతి సూర్యప్రకాష్ దర్శకత్వంలో నిర్మించిన 'గరుడ గర్వభంగం', గజేంద్రమోక్షం, రోజ్ ఆఫ్ రాజస్థాన్ వంటి నిశ్శబ్ద (మూకీ) చిత్రాలలో వైవీ రావు కథానాయకుడుగా నటించారు. ఆ తర్వాత కాలంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించడమే కాక, పలు చిత్రాలకు దర్శకత్వం నిర్వహించారు. ఇంకా అనేక చిత్రాలలో కథానాయకుడిగా నటించి ప్రేక్షకులను మెప్పించారు. సారంగధర (మూకీ), పాండవ అజ్ఞాతవాసం(మూకీ), శ్రీకృష్ణ తులాభారం, స్వర్ణలత, భక్త మీరా, మళ్లీ పెళ్లి, విశ్వమోహిని, సావిత్రి, సత్యభామ, రామదాస్, లవంగి, మానవతి, మంజరి, శ్రీకృష్ణ గారడి, ఒక నారి-వంద తుపాకులు వంటి చిత్రాలు ఆయన అమోఘ ప్రతిభాపాటవాలకు నిదర్శనాలు. 1934లో 'సతీ సులోచన' తొలి కన్నడ టాకీ చిత్రాన్ని వైవీ రావు నిర్మించారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించడంతో కన్నడ సినీ రంగంలోనూ ఆయన ప్రముఖ నిర్మాతగా పేరుపొందారు. 1937లో తాను నిర్మించిన 'చింతామణి' తమిళ చిత్రం ఒకే థియేటర్లో ఏడాది పాటు విజయవంతంగా ప్రదర్శించబడడం చిత్రసీమ లోనే పెద్ద సంచలనం కలిగించింది. 1939లో తన సొంత చిత్ర నిర్మాణ సంస్థగా 'చింతామణి పిక్చర్స్'ని స్థాపించారు. 1940లో విడుదలైన 'విశ్వమోహిని' తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక మైలు రాయి. ఈ చిత్రానికి వై.వి.రావు దర్శకత్వం వహిం చగా, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి కథ, మాటలు అందించారు. ఈ సినిమా వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. 1946లో నిర్మించిన తమిళ చిత్రం 'లవంగి' సినిమా కూడా గొప్ప విజయం సాధించింది. ఆ చిత్రాన్ని హిందీలో కూడా రూపొం దించి మరింత ఘన విజయం సాధించి హిందీ చిత్ర పరిశ్రమలోనూ వైవీరావు ఒక వెలుగు వెలిగారు. 'రామదాసు' సినిమాలో తానీషా, 'సత్యభామ' చిత్రంలో శ్రీకృష్ణుని పాత్రల్లో వైవీరావు నటన అశేష ప్రేక్షకుల విశేష ప్రశంసలందుకుంది. 1950లో శ్రీ వరుణ ఫిలిమ్స్ అనే సంస్థను కూడా ఆయన స్థాపించి మరిన్ని చిత్రాలు తీశారు.

**కీర్తిమూర్తులు**

వై.వి.రావు 1973లో నిర్మించిన 'ఒక నారి-వంద తుపాకులు' సినిమా ప్రధానంగా నలుపు-తెలుపు చిత్రంగా ఉన్నప్పటికీ, క్లైమాక్స్ సన్నివేశాలను రంగుల్లో మరియు సినిమాస్కోప్‌లో ప్రదర్శించడం నాటి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక వినూత్న ప్రయోగంగా కలకలం సృష్టించింది. గొప్ప నిర్మాతగా పేరుపొందిన వైవీ రావు.. అప్పట్లో 'లవంగి' చిత్ర కథానాయిక.. ప్రఖ్యాత నర్తకిగా పేరొందిన నుంగంబాక్కం జానకి కుమార్తె రుక్మిణిని వివాహం చేసుకున్నారు. తెలుగు సినీ నటీమణి లక్ష్మి..వీరి కుమార్తే. వైవీ రావు.. చిత్రసీమలో ఓ ధృవతార అని చెప్పవచ్చు. 75 ఏళ్ల వయసులో 1973 ఫిబ్రవరి 13న ఆ మహనీయుడు మద్రాసులో తుదిశ్వాస విడిచారు. సినీరంగంలోనూ మన నెల్లూరు ఖ్యాతిని దశ దిశలా చాటి.. జగద్విదితం చేసిన కీర్తిమూర్తి వైవీ రావు.. చిరస్మరణీయులు!..

(ఫిబ్రవరి 13 వై.వి.రావు వర్ధంతి)



**చల్లా చంద్రశేఖర్‌రెడ్డి**
సెల్. 94409 28666

## టూకీగా...



### కావలిలో రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కావలిలోని ఉదయగిరిరోడ్డులో జరుగుతున్న రహదారి పనులను ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి హైవే అధికారులతో కలసి ఇటీవల పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై వాన నీళ్ళు నిలవకుండా రోడ్లను నాణ్యతాప్రమాణాలతో పటిష్టంగా నిర్మించాలన్నారు. మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఇ సాయిరాం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో కూరగాయల సాగుపై.. విద్యార్థులకు అవగాహన

ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు హెడ్మాస్టర్ జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు ఒరుగంటి నారాయణల ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకు కూరల సాగుపై అవగాహన కల్పించారు.

### ఇనమడుగు రైతులకు.. పొలాల వద్దే పాసుపుస్తకాలు

రైతులకు పొలాల గట్ల వద్దనే పాసుపుస్తకాలు అందజేస్తు న్నారు అధికారులు. ఇనమడుగులో ఇటీవల డిప్యూటి తహశీల్దార్, డిప్యూటి రీసర్వే తహశీల్దార్, పలువురు టీడీపీ నాయకులు పొలాల వద్దకు వెళ్ళి, ప్రభుత్వం రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాసుపుస్తకాలను సంబంధిత రైతులకు అందజేశారు.

### ఆత్మకూరులో బాధితురాలికి 'డా. వింజం ట్రస్టు' సాయం

ఆత్మకూరులో రెండుకాళ్ళు పనిచేయక, ఆర్థికస్థితి బాగాలేక ఇబ్బందులు పడుతున్న పఠాన్ బషీరున్నిసా కుటుంబానికి డాక్టర్ వింజం దొరసానమ్మ స్మారక ట్రస్టు అధినేత డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ ఈనెల 9న మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకున్నారు. ట్రస్టు సభ్యులు షాహిద్దీన్, అశోక్, రహీం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణపట్నంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కి స్థల పరిశీలన

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మండల తెలుగుయువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల స్థల పరిశీలన చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్, ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

SANKARA NETHRALAYA, USA

# నెల్లూరుజిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ
## శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై
మరియు
## శాంతా వసంతా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో

SANKARA NETHRALAYA



పాపిరెడ్డిపాళెం వాస్తవ్యులు
**కీర్తిశేషులు కోడూరు వేంకటరమణారెడ్డి**
**శ్రీమతి శాంతమ్మ గార్ల స్మృత్యంకంగా**

# ఉచిత కంటి పొర చికిత్స శిబిరం

కంటి పరీక్షలు జరుగు స్థలం :
**ప్రభుత్వ బి.సి. హాస్టల్** (సాయిబాబా గుడి వద్ద),
యం.ఆర్.ఓ. ఆఫీసు దగ్గర, **ఇస్కపాళెం గ్రామం,**
తోటపల్లిగూడూరు మండలం, నెల్లూరుజిల్లా - 524311.

కంటి పొర పరీక్షలు నిర్వహించు తేదీలు :
**15.02.2026 ఆదివారం నుండి**
**21.02.2026 శనివారం వరకు**

రిజిస్ట్రేషన్ సమయం : **ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥1.00 గం॥ల వరకు**



**కంటి ఆపరేషన్ వాహనము**
కంటి శుక్లం (పొర) గలవారికి మాత్రమే
కంటి శుక్లం (పొర) ఆపరేషన్ చేయబడును.

కంటి ఆపరేషన్ జరుగు తేదీలు :
**19.02.2026 గురువారం నుండి**
**23.02.2026 సోమవారం వరకు**

- ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన వాహనంలో (మొబైల్ ఐ సర్జికల్ యూనిట్) ప్రభుత్వం అనుమతించిన శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి వారిచే కంటి ఆపరేషన్లు చేయబడును.
- చికిత్సకు వచ్చిన వారికి ఆపరేషన్, ఐ.ఓ.ఎల్. లెన్స్, కంటి అద్దాలు మరియు మందులు ఉచితముగా ఇవ్వబడును.
- (బి.పి, షుగర్) ఇతర వ్యాధులు వున్నవారు కంటి చికిత్సకు వచ్చేటప్పుడు మీరు వాడే మందులు తప్పనిసరిగా తీసుకురావలెను.
- కంటి చికిత్స జరిగిన తరువాత 2 గంటలలో ఇంటికి వెళ్ళవచ్చును (అంబులేటరీ సర్వీస్).
- కంటి చికిత్స ఆధునిక పద్ధతిలో చేయబడును (మైక్రోస్కోపిక్ స్మాల్ ఇన్‌సిషెన్).
- ఈ చికిత్సకు ఎటువంటి డబ్బు చెల్లించనవసరం లేదు. పూర్తిగా ఉచితం.
- చికిత్సకు వచ్చేవారు తప్పనిసరిగా ఫోన్ నెంబర్ మరియు ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకొని రావలయును.
- వర్షం వచ్చినా కూడా ఈ ఉచిత శిబిరం కొనసాగుతుంది. ఆపరేషన్లు యధావిధిగా జరుగుతాయి.

**సంప్రదించవలసిన నెంబర్లు : 9791102648, 7358463308, 6380515583, 8668147829**

శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు
**డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి - శ్రీమతి వసంత గారు**
**వారి కుటుంబసభ్యులు** మరియు
**శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై**
వారి సారధ్యంలో జరిగే ఈ **మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని,**
తోటపల్లి గూడూరు, అదే మండలంలోని పాపిరెడ్డిపాళెం, ఇస్కపాళెం, పేడూరు
తదితర పరిసర గ్రామప్రజలందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా మనవి.



Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com